బొమ్మను చేసి.. ప్రాణము పోసి.. 6

- ఆ గ్రామం బొమ్మల పొదరిల్లు
- బొమ్మల తయారీకి పెట్టింది పేరు గాడిలంక
- సుమారు 150 ఏళ్ల చరిత్ర
- గణనాథుల విగ్రహాలతో కళకళ

కేబినెట్ 'వరాలు'



- పుష్కర ఎత్తిపోతల పథకం పైపులైన్ల మార్పునకు ఆమోదముద్ర
- రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు పచ్చజెండా
- 31వేల ఎకరాల ఆయకట్టుకు ఊపిరిలూదిన సీఎం చంద్రబాబు
- గ్రామ, వార్డు సచివాలయాల్లో పోస్టుల భర్తీకి ఆమోదంతో ఊరట
- చింతూరు ఆసుపత్రి 50 నుంచి వంద పడకలుగా మార్పునకు ఓకే

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జగ్గంపేట నియోజకవర్గంలో కీలకమైన తోట వెంకటాచలం పుష్కర ఎత్తిపోతల పథకానికి ప్రభుత్వం తీపికబురు అందించింది. గత వైసీపీ హయాంలో పైపులైన్లు మరమ్మతుకు గురై మూలనపడ్డ ప్రాజెక్టుకు సీఎం చంద్రబాబు ఊపిరి పోశారు. పాడైపోయిన కీలక పైపులైన్ల స్థానంలో కొత్తవి నిర్మించడానికి మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపింది. రూ.51.67 కోట్లతో పనులు చేపట్టేందుకు వీలుగా పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనకు పచ్చజెండా ఊపింది. దీంతో 31వేల ఎకరాల ఆయకట్టుకు తిరిగి నీరు అందబోతోంది. గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద నిర్మించిన ఈ పథకం ఎన్నో ఏళ్లుగా మరమ్మతులకు గురైంది. దీనికి శంకుస్థాపన నుంచి టెండర్లు పిలిచి పనుల ప్రారంభం వరకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలోనే జరిగింది. తీరా వైఎస్ సీఎం అయిన తర్వాత ప్రాజెక్టు పనుల్లో మార్పులు చేశారు. సాగునీరు ప్రవహించడానికి ఇనుప పైపులు బదులు సిమెంట్ పైపులు వినియోగించారు. దీంతో కాలక్రమేణా సిమెంట్ పైపులపై ఒత్తిడి పెరిగి ఎందుకు పనికి రాకుండా పోయాయి. గత వైసీపీ హయాంలో వీటికి మరమ్మతులు చేయాల్సి ఉన్నా పట్టించుకోలేదు. దీంతో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దాదాపు 14సార్లు సీఎం చంద్రబాబు దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లారు. చంద్రబాబు మానసపుత్రికలాంటి ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేయాలని కోరారు. దీంతో ప్రయత్నాలు ఫలించి పీఎస్‌సీ ప్రెజర్ మెయిన్‌ను ఎంఎస్ ప్రెజర్ మెయిన్‌తో మార్చే పనికి టెండర్లను ఆహ్వానించి రూ.51.67 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చే ప్రతిపాదనను మంత్రిమండలి ఆమోదించింది. దీనిపై ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్పందిస్తూ సీఎం చంద్రబాబు రుణం తీర్చుకోలేనిదని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పైపులైన్ల మరమ్మతులకు నిధులు అడిగితే రూ.25 లక్షలు విదిల్చారని, కానీ ఇప్పుడు సీఎం చంద్రబాబు రూ.51.67కోట్లు విడుదలకు నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. ఇక గ్రామ, వార్డు సచివాలయాల్లో డిప్యుటేషన్, అవుట్ సోర్సింగ్ విధానం కింద 2,778 పోస్టుల భర్తీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న 1,500 పోస్టుల్లో 700వరకు పోస్టులను భర్తీ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. అలాగే చింతూరులో ఉన్న 50పడకల ఆసుపత్రిని వంద పడకలస్థాయికి పెంచుతూ ఆమోదించింది.

ఉరకలేస్తోంది!



రావులపాలెంలోని గౌతమి వంతెన వద్ద గోదావరి వరదనీటిలో చిక్కుకున్న అరటితోటలు

- ఉధృతంగా పెరుగుతున్న గోదావరి వరద
- సముద్రంలోకి 11.50 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల
- సఖినేటిపల్లి-నర్సాపురం సహా అన్ని రేవుల్లోను పంటు ప్రయాణాలు నిలుపుదల
- దిండి-చించినాడ మధ్య వారధి మరమ్మతులు మూడురోజులపాటు వాయిదా
- అప్పనపల్లిలో పర్యటించిన కలెక్టర్ మహేష్‌కుమార్
- లంకల్లో వరద ప్రభావం.. నీటమునుగుతున్న పంటలు

గోదావరి నది ఉరకలేస్తోంది. వరద ఉధృతంగా పెరుగుతోంది. దీంతో జిల్లాలోని గౌతమీ, వృద్ధగౌతమీ, వైనతేయ, వశిష్ట నదీపాయలు పొంగి ప్రవహిస్తున్నాయి. లంక గ్రామాల్లోకి వరదనీరు చేరుతుండడంతో ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా ప్రధాన రేవులతో సహా వివిధ ప్రాంతాల్లో పంట్లు, పడవలపై ప్రయాణాలను ముందు జాగ్రత్త చర్యగా నిలిపివేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని పరిస్థితులపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సమీక్షించారు. నియోజకవర్గ స్థాయిలో నియమితులైన ప్రత్యేకాధికారులు, ఆర్డీవోలు ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్నారు. మూడురోజులపాటు దిండి, చించినాడ మధ్య వారధిపై మరమ్మతుల పనులను వాయిదా వేసినట్టు కలెక్టర్ ప్రకటించడంతో చిన్న వాహనదారులు ప్రయాణించడానికి మార్గం సుగమమైంది.

భద్రాచలం వద్ద గోదావరికి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేసి కోనసీమ జిల్లాలోని నదీపరివాహక గ్రామాలకు అలెర్ట్ ప్రకటించారు. సుమారు 11.50లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలడంతో కోనసీమలోని నదీ పరివాహక గ్రామాల్లో వరద ముంపు అనూహ్యంగా పెరిగింది. తొగరపాయ, చాకలిపాలెం వద్దకాజ్‌వేలపై వరదనీరు చేరడంతో అక్కడ పరిస్థితులను అధికారులు సమీక్షించారు. జిల్లావ్యాప్తంగా 40కుపైగా లంకగ్రామాలు జలదిగ్బంధానికి గురి కావచ్చని సమాచారం. కాగా వశిష్ట నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నందున ఉమ్మడి గోదావరి జిల్లా ప్రాంతమైన సఖినేటిపల్లి-నర్సాపురం మధ్య పంటు ప్రయాణాలను గురువారం నిలిపివేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈనెల 21నుంచి మూడురోజులపాటు దిండి-చించినాడవంతెన మరమ్మతుల దృష్ట్యా రాకపోకలు బంద్ చేసినట్టు ప్రకటించిన కలెక్టర్ వరద ఉధృతి దృష్ట్యా రేవుల్లో ప్రయాణాలు నిలిపివేయాలని ఆదేశించారు. అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితులను కలెక్టర్ మహేష్‌కుమార్ గురువారం స్వయంగా పరిశీలించి అక్కడ అధికారులు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. వరద ఉధృతంగా పెరుగుతున్న దృష్ట్యా నదీపరివాహక లంక గ్రామాల ప్రజలు అప్రమత్తతతో ఉండాలని పిలుపునిచ్చారు. పి.గన్నవరం మండలం జి.పెదపూడి వద్ద తాత్కాలిక గట్టు తెగిపోవడంతో నాలుగు లంక గ్రామాల ప్రజలకు పడవలపై లైఫ్ జాకెట్ల సహాయంతో దాటింపు చర్యలు కొనసాగిస్తున్నారు. శుక్ర, శనివారం నాటికి వరద ఉధృతి మరింత పెరిగితే చేపట్టాల్సిన జాగ్రత్తలపై అధికారులు నియోజకవర్గ స్థాయిలో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ముందుజాగ్రత్తగా లంకప్రాంతాల్లో ఉన్న పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే పనిలో రైతులు ఉన్నారు. మహారాష్ట్రలో వర్షాల దృష్ట్యా వరద మరింత పెరిగొచ్చని అధికారుల అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో లంక ప్రాంతాల్లోని కొబ్బరితోటల్లో దింపులు తీసి సురక్షిత ప్రాంతాలకు తరలించుకుంటున్నారు.



మామిడికుదురు మండలం అప్పనపల్లి స్నానాలరేవు వద్ద ఉధృతంగా గోదావరి



కె.గంగవరంలోని కోటిపల్లి పుష్కరాల రేవులో పైమెట్ల వరకూ వచ్చేసిన వరదనీరు



ఆలమూరు మండలం జొన్నాడలో రెండు బ్రిడ్జిల మధ్య వరద ప్రవాహం



పి.గన్నవరం కొత్త, పాత అక్విడెక్టుల మధ్య గోదావరి వరద ఉధృతి



పి.గన్నవరం మండలం బెల్లంపూడి నదీపాయను దాటుతున్న లంకగ్రామస్తులు



అయినవిల్లిలంక కాజ్‌వేపై వరద నీటిలోనే రాకపోకలు సాగిస్తున్న స్థానికులు



ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంకలో కొబ్బరితోటలోకి చేరిన వరదనీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



అప్పనపల్లి కాజ్‌వేవద్ద వరదను పరిశీలిస్తున్న కలెక్టర్

మామిడికుదురు,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా నదీ తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉందని, ముంపు ప్రాంత, తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. స్థానిక అధికారుల వాతావరణ హెచ్చరికలకు అనుగుణంగా సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. తీరప్రాంత ప్రజలు అత్యవసర పరిస్థితిలో మాత్రమే బయటకు రావాలన్నారు. వరద పెరిగితే ముంపు బాధితుల తరలింపు, పునరావాస కేంద్రాల నిర్వహణపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్, ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ఆర్ఐ ఇబ్రహీం, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరావు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై వైద్యసిబ్బందికి శిక్షణ

అమలాపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారికి ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు గురువారం నుంచి సెప్టెంబరు 15 వరకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలోభాగంగా సంక్రమిత వ్యాధులపై శిక్షణలో భాగంగా జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, వైద్యాధికారులు, ఎన్ఎంహెచ్‌పీ, ఎంఎల్‌హెచ్‌పీ తదితర సంబంధిత ఆరోగ్య సిబ్బందికి విస్తృతమైన సర్వికల్ క్యాన్సర్, స్క్రీనింగ్, నివారణ శిక్షణ కార్యక్రమం అమలాపురంలోని ఏరియా ఆస్పత్రిలో గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, నోడల్ ఆఫీసర్ తిరుమలరావు, ప్రోగ్రాం ఆఫీసర్ సుమలత, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్‌రెడ్డి, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు పాల్గొన్నారు.

పథకాల అమలు తీరులో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి

- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం,ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరులో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ జిల్లాకలెక్టర్లు, జేసీలతో అమరావతినుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించి సూచనలు చేశారు. జలవనరుల సంరక్షణ, భూగర్భజలాల పెంపు, తాగునీటి వనరుల అభివృద్ధి వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రతిప్రభుత్వశాఖ ప్రగతి నివేదికలను అప్‌లోడ్ చేయాలని, నాలుగో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహణ,పాజిటివ్ పబ్లిక్ సంతృప్తిస్థాయిల్లో పురోగతిపై జిల్లాలవారీగా సమీక్షించారు. అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ తాగునీటి చెరువుల అభివృద్ధి, భూగర్భ జలాలపెంపుపై దృష్టిసారించాలన్నారు. నిర్దేశిత గడువు నాటికి కేపీఐ పనితీరు నివేదికలు ఆన్‌లైన్ చేయాలని సూచించారు. నరేగా ద్వారా భూగర్భజలాల పెంపునకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్ మోనటరింగ్ డాష్ బోర్డులో జిల్లాకు చెందిన అభివృద్ధి అంశాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. స్వామిత్వ సర్వే గ్రామకంఠంలో నాలుగుదశల్లోగ్రౌండ్ మార్కింగ్, వాల్యుయేషన్ నోటిఫికేషన్ ప్రక్రియను దశలవారీగా నిర్వహించాలన్నారు. సమీక్షలో జేసీ నిషాంతి,డీపీవో శాంతి, జిల్లాపౌరసరఫరాల అధికారి ఉదయభాస్కర్, గనులశాఖ ఏడీ వంశీధర్, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ రాజేశ్వరి పాల్గొన్నారు.

ఎరువులు బ్లాక్‌మార్కెట్‌లో.. విక్రయిస్తే కఠిన చర్యలు



మండపేటలో ఎరువుల గోదామును తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ సంచాలకులు

- వ్యవసాయశాఖ సంచాలకులు బోసుబాబు
- మండపేట, రామచంద్రపురం ఎరువుల గోదాముల్లో తనిఖీలు

మండపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులను ప్రభుత్వం సిద్ధంగా ఉంచిందని, ఎటువంటి ఎరువుల కొరత లేదని జిల్లా వ్యవసాయ శాఖ సంచాలకులు బోసుబాబు తెలిపారు. ఒకవేళ వ్యాపారులు కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేసి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆలమూరు వ్యవసాయశాఖ ఏడీ సీహెచ్.కె.వి.చౌదరితో కలిసి ఆయన గురువారం మండపేటలోని శ్రీలక్ష్మీ ఎరువులు గోదామును తనిఖీ చేశారు. ఎరువుల వివరాల రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసే ప్రతి ఎరువు బస్తాకు డీలర్లు బిల్లును ఇవ్వాలని ఆదేశించారు. రైతులు కూడా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఎరువుల గోదాములో రికార్డులు నిర్వహణ, సరుకు సరిపోయిందని జేడీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట మండపేట మండల వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్, విస్తరణాధికారి బాలకృష్ణ ఉన్నారు.

రామచంద్రపురం అర్బన్‌లో...

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం అర్బన్‌లో ఎరువుల గోదాములను జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులకు ఎరువుల కొరత రాకూడదని, ఎంఆర్‌పీ కంటే అధికంగా అమ్మితే డీలర్లపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి ఎరువులు రైతులు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని, గోదాముల వద్ద నిల్వలకు, ఆన్‌లైన్‌లో ఉన్న నిల్వలకు తేడాలు ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, మండల వ్యవసాయాధికారి టి.వి.ఆర్.మణిదీప్ పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా రూ.5కోట్ల విత్‌హెల్డ్ సొమ్ము విడుదల

- డ్వామా పీడీ మధుసూదన్

పి.గన్నవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాలకుగాను 20శాతం విత్‌హెల్డ్ సొమ్ము రూ.5.76కోట్లు విడుదలైనట్లు డ్వామా పీడీ మధుసూదన్ వివరించారు. జిల్లా వ్యాప్తంగా 383 గ్రామ పంచాయతీలకుగాను సీసీరోడ్లు, మినీగోకులాలు, చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు సంబంధించి 8154(రెండు దశల్లో) పనులకుగాను విత్‌హెల్డ్ సొమ్ము రూ.5.76 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. అప్పట్లో చేసిన పనులకు పలుచోట్ల ఎంబుక్‌ల వివరాలు ప్రస్తుతం లేనప్పటికీ ఆయా పనులకు కూడా తాజాగా ఎంబుక్‌లతో కూడిన వివరాలను సమర్పిస్తే వారికి కూడా విత్‌హెల్డ్ సొమ్మును అందించేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిసింది. గురువారం పి.గన్నవరం జనసేన క్యాంపు కార్యాలయంలో ఏపీడీ డి.రాంబాబు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బంది సమక్షంలో 2014-19 మధ్య జరిగిన ఎన్ఆర్ఈజీయస్ పనుల జాబితాను అందించి విత్‌హెల్డ్ సొమ్ము ఎంతమేర వస్తుందో వివరించారు. సమావేశంలో ఏపీవో లక్ష్మీనారాయణ, ఫీల్డ్‌అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో ప్రథమ విజేత అమలాపురం 7

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం.. ఆరు దశల పరిశీలన ప్రారంభం



కామనగరువులో ఇంజనీరింగ్ విద్యార్థి వివరాలు సేకరిస్తున్న సచివాలయ కార్యదర్శి

- జిల్లాలో 32వేల మంది విద్యార్థుల ఎదురుచూపులు
- అర్హుల వివరాల సేకరణ

అమలాపురం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎప్పుడు విడుదల చేస్తుందా అని విద్యార్థులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో కళాశాలల్లోని విద్యార్థులే కాకుండా ఫీజులు చెల్లించేందుకు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం కూటమి ప్రభుత్వం 6స్టెప్ వెరిఫికేషన్ కార్యక్రమం గురువారం నుంచి చేపట్టింది. ఇప్పటికే సచివాలయాలవారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందే విద్యార్థుల జాబితాలను విడుదల చేశారు. దీంతో ఆయా జాబితాల్లోని పేర్లు గల విద్యార్థులకు సచివాలయాల సిబ్బంది సమాచారం అందించి ప్రభుత్వమే సరఫరా చేసిన ఆరుదశల వెరిఫికేషన్ పత్రాలను పూర్తిచేయిస్తున్నారు. జిల్లాలో 32వేలమంది ఇంజనీరింగ్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ తత్సమాన కోర్సులు చదువుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన విద్యార్థులు ఉన్నారు. విద్యార్థి ఎక్కడ, ఏ కళాశాలలో ఎన్నో సంవత్సరం చదువుతున్నది, విద్యార్థి, తల్లి జాయింట్ బ్యాంకు ఖాతా వివరాలు ఆ పత్రంలో నమోదు చేయిస్తున్నారు.

6స్టెప్ వెరిఫికేషన్‌లో భాగంగా కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పెన్షనర్లు ఉన్నారా, ఎవరైనా ఇన్‌కం ట్యాక్స్ చెల్లిస్తున్నారా, ఫోర్‌వీలర్ కలిగి ఉన్నారా, మున్సిపల్ ఏరియాలో 1500 చదరపు అడుగుల కంటే ఎక్కువ స్థలం కలిగి ఉన్నారా, కుటుంబ ఆదాయం రూ.2.50లక్షల కంటే ఎక్కువ ఉందా, పరిమితికి మించి భూమి కలిగి ఉన్నారా తదితర వివరాలతోపాటు కుటుంబంలోని మొత్తం సభ్యుల వివరాలు సైతం నమోదు చేయిస్తున్నారు. సంబంధిత పత్రాలను అప్‌లోడ్ చేసే పనిలో సచివాలయ ఉద్యోగులు బిజీగా ఉన్నారు. ఇక ఎవరైనా ఇంజనీరింగ్ కోర్సును పూర్తి చేసినవారు ఫీజు రీయింబర్స్‌మెంట్ పొందాలంటే రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంది. గతంలోనే కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు కళాశాలలకు చెల్లించిన ఫీజుల వివరాలతో సంబంధిత రశీదులను అప్పట్లో అప్‌లోడ్ చేశారు. ఆ సమయంలో చేయించుకోనివారు, చేయించుకున్నప్పటికీ మళ్లీ వారి పేర్లు రీ వెరిఫికేషన్‌కు వస్తే సచివాలయ ఉద్యోగులు ముందుగానే వారికి సమాచారం అందిస్తున్నారు. 6స్టెప్ వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత అయినా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేస్తుందన్న ఆశాభావంతో విద్యార్థులు ఎదురుచూస్తున్నారు.



గణనాథుల విగ్రహాలకు తుది మెరుగులు అద్దుతున్న కళాకారులు

ఆ పల్లెటూళ్లో 1364 మంది జనాభా ఉండగా 440 కుటుంబాలు ఉన్నాయి. బొమ్మల తయారీ ద్వారా ఇక్కడ ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఎంతోమంది ఉపాధి పొందుతుంటారు. ఏ ఇల్లు చూసినా రకరకాల బొమ్మలతో దర్శనమిస్తాయి. ఏడాది పొడవునా విగ్రహాలు తయారు చేస్తారు. వినాయకచవితికి బొమ్మల తయారీకి ఒక ప్రత్యేకత ఉంది. మూడు, నాలుగు నెలల ముందే బొమ్మల తయారీలో కళాకారులు నిమగ్నమవుతారు. మట్టితో ఐదు అంగుళాల నుంచి 10 అడుగుల వరకు బొమ్మలు తయారు చేస్తారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ అయితే అడుగు నుంచి 15 అడుగుల వరకు తయారు చేస్తుంటారు. ఆ గ్రామమే గాడిలంక.



బొమ్మను చేసి... ప్రాణము పోసి...

- ఆ గ్రామం బొమ్మల పొదరిల్లు
- బొమ్మల తయారీలో పెట్టింది పేరు గాడిలంక
- సుమారు 150 ఏళ్ల చరిత్ర
- గణనాథుల విగ్రహాలతో కళకళలాడుతున్న వైనం

ముమ్మిడివరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మట్టికి ప్రాణం పోసే దేవుళ్లు అక్కడ ఉన్నారు. అక్కడ శిల్ప కళాకారుల చేతిలో మట్టి అద్భుతమైన కళాఖండాలుగా రూపుదిద్దుకుంటుంది. పచ్చని పంట పొలాల మధ్య ఆ గ్రామం రంగురంగుల బొమ్మలతో కళకళలాడుతుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గాడిలంక బొమ్మల తయారీకి పెట్టింది పేరు. ఇక్కడ బొమ్మల తయారీకి సుమారు 150 ఏళ్ల చరిత్ర ఉంది. అప్పట్లో పెద్దిరెడ్డి వెంకన్న అనే శిల్పి గ్రామంలో తొలిసారి బొమ్మల తయారీని ప్రారంభించారు. ఆ తర్వాత అతని కుమారుడు అచ్చుతరామయ్య ద్వారా మిగతా వారు శిల్పకళ నేర్చుకున్నారు. గ్రామంలో 80 వరకు బొమ్మల పరిశ్రమలు ఉండేవి. ప్రస్తుతం బొమ్మల తయారీలో లాభసాటి కరువవడంతో 15 కంపెనీలకు పరిమితమయ్యాయి. గ్రామంలో వందలాది మంది కళాకారులు వినాయకచవితి సీజన్‌లో వేలాది బొమ్మలు తయారుచేస్తుంటారు. ఇక్కడి నుంచి దేశ, విదేశాలకు కూడా విగ్రహాలు ఎగుమతి అవుతాయి. చిన్నబొమ్మల తయారీకి జిగురు మట్టిని నానబెట్టి కాగిత గుజ్జు, నావసుద్ధ కలిపి మెత్తగా కుమ్మి మిశ్రమం తయారు చేస్తారు. పెద్దపెద్ద బొమ్మలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేస్తారు. ముందుగా మూసలు తయారు చేసుకుని వాటి ఆధారంగా తీర్చిదిద్దుతారు. పెద్ద విగ్రహాలు అయితే విడి భాగాలు తయారుచేసి వాటిని అతుకుతారు. ఇక్కడ తయారైన బొమ్మలను కర్ణాటక, ఒడిసా, మహారాష్ట్ర, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, మంచిర్యాల తరలించి అక్కడ విక్రయిస్తారు. ప్రతి సీజన్లోనూ రూ.కోటి నుంచి రూ.కోటి 50 లక్షల వరకు విలువైన బొమ్మలు ఇక్కడి నుంచి ఎగుమతి అవుతాయి. ప్రముఖ శిల్పి పెద్దిరెడ్డి వెంకటకృష్ణ మాధవరావు ఆర్డరుపై దేశ నాయకులు, రాజకీయ నాయకులు, ప్రముఖుల విగ్రహాలు తయారు చేస్తారు.



గణనాథుల ప్రతిమలను తయారు చేస్తున్న శిల్ప కళాకారులు

కూలీల కొరత, కూలీ రేట్లు పెరిగిపోవడం, ముడి సరుకుల రేట్లు పెరిగిపోవడం వంటి వాటితో బొమ్మల తయారీలో గిట్టుబాటు కరువైంది. దీంతో ఇటీవల బొమ్మల తయారీ కొంత తగ్గింది. కళాకారుల జీవనోపాధి దెబ్బతింది. కొంత మంది యువత ఈ వృత్తికి స్వస్తి పలికి ప్రత్యామ్నాయ వృత్తుల వైపు వెళ్లారు. మరికొంతమంది అయితే ఇతర వృత్తులు చేపట్టలేక, వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని వదులుకోలేక కాలక్షేపం చేస్తూ ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నారు. బొమ్మల తయారీని ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తించి కళాకారులకు ఆర్థిక చేయూత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆర్థిక చేయూతనివ్వాలి

కొమ్మిరెడ్డి రాజేశ్వరి, శిల్ప కళాకారిణి



అత్తింటివారి సంప్రదాయబద్ధంగా వస్తున్న బొమ్మల తయారీ నేర్చుకున్నా. పదేళ్ల నుంచి కుటుంబసభ్యులతో కలిసి బొమ్మలు తయారుచేస్తున్నా. దీంతో కొంత ఉపాధి లభిస్తోంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే బొమ్మల తయారీ వల్ల కళాకారులకు మరింత ఉపాధి చేకూరుతుంది.

పెన్షన్ సదుపాయం కల్పించాలి

కొమ్మిరెడ్డి సూర్యచంద్రరావు, శిల్ప కళాకారుడు



40 ఏళ్లుగా బొమ్మలు తయారు చేస్తున్నాం. అంతగా గిట్టుబాటు లేదు. అలవాటైన వృత్తిని వదులుకోలేక బొమ్మలనే తయారు చేస్తున్నాం. బొమ్మలకు పెయింటింగ్ వేయడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. కంటిచూపు మందగిస్తుంది. 50 ఏళ్లు నిండిన కళాకారులకు పెన్షన్ సదుపాయం కల్పించాలి. ప్రత్యేక సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి.

గిట్టుబాటు ధర కరువైంది

మహాదశ సత్యగణేశ్వరరావు, శిల్పి



గత 40 ఏళ్లుగా ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. ప్రస్తుతం అంతగా గిట్టుబాటు లభించట్లేదు. తయారీ భారంగా మారింది. ప్రభుత్వం ప్రోత్సాహం లభించట్లేదు. కూలీల కొరత, ముడిసరుకు రేట్లు పెరిగిపోవడంతో బొమ్మల తయారీ గిట్టుబాటు కావట్లేదు.

కుటీర పరిశ్రమగా ప్రోత్సహించాలి

పెద్దిరెడ్డి సత్యనారాయణమూర్తి, శిల్పి



మా తాతల నాటి నుంచీ సంప్రదాయంగా వస్తున్న ఈవృత్తిని మేమూ సాగిస్తున్నాం. 40 ఏళ్లుగా బొమ్మలు, విగ్రహాల తయారీలో ఉన్నాను. వాటికి డిమాండ్ ఉన్నా గిట్టుబాటు లభించట్లేదు. పరిశ్రమను నడపలేక పోతున్నాం. రోజంతా శ్రమించినా రోజు కూలీ మాత్రమే కిడుతోంది. ప్రభుత్వం కుటీర పరిశ్రమగా గుర్తించి ప్రోత్సహించాలి.



కాకినాడలో విద్యార్థులకు తోలుబొమ్మలాట జానపద కళపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

కళను బతికిద్దాం!

- భవిష్యత్తు తరాలకు దూరమవుతున్న జానపద కళలు
- ఆదుకోవాలంటున్న కళాకారులు
- నేడు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ),ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): జానపదకళలకు ఒకప్పుడు ఎంతో ప్రాచుర్యం ఉండేది. కాలక్రమంలో జానపదం మసకబారుతోంది. ఇవి ప్రజలనుంచి సంక్రమించిన కళారూపాలు. ఇవి సాధారణంగా ఒకప్రాంతం లేదా సంస్కృతికి ప్రత్యేకమైనవి. గ్రామీణ సంస్కృతికి అద్దం పట్టే విశిష్ట సంప్రదాయానికి సజీవ సాక్ష్యమైన జానపదకళలు కనుమరుగవుతున్నాయి. కళనే నమ్ముకున్న వేలాదిమంది కళాకారులు రోడ్డున పడుతున్నారు. కళలు వెలుగులోకి రావడంలేదు. కళాకారులకు పొట్ట గడవని దుస్థితి ఏర్పడింది. ఆధునికత, ప్రపంచీకరణ, సామాజిక మార్పులు, పాశ్చాత్య సంస్కృతి ప్రభావం కళలను దెబ్బతీశాయి. జానపదకళలు ప్రజల్లో అవగాహనతోపాటు చైతన్యం నింపేదుకు ఉపయోగపడతాయి. నేడు అంతర్జాతీయ జానపద కళల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

జానపద కళలు..

జముకుల కథ, తంబుర్ర కథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, ఒగ్గు కథ, యక్షగానం, గొల్ల సుద్దులు, వీధినాటకాలు, పగటి వేషాలు, జడ కోలలు, కోలాటం జానపద కళలు అంటారు.

జమునానగర్‌లో తోలుబొమ్మలాట

ఆనాటి ప్రముఖ సినీనటి జమున కళాకారుల చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పుడు కాకినాడరూరల్ మాధవపట్నం సమీపంలో కళాకారులకు ఒకకాలనీ నిర్మించి దానికి జమునానగర్‌గా పేరు పెట్టారు. ఇప్పటికీ అక్కడ తోలుబొమ్మలాట కళాకారులు జీవనం సాగిస్తూ తోలుబొమ్మలాటను సజీవంగా తర్వాత తరానికి కూడా అందించేలా కొత్తవారికి శిక్షణ తరగతులు నిర్వహిస్తూ ముందుకెళ్తున్నారు.

జిల్లాలో జానపద కళల స్థితి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జానపద కళాకారులు కొందరు కళనే వృత్తిగా చేసుకొని జీవనపాధి పొందుతుంటే మరికొందరు పూట గడవని స్థితిలో ఉన్నారు. ఉత్సవాలు, పండుగలు, ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంలో తప్ప వీరి ప్రదర్శనలకు వీలు లేకుండా పోయింది. కొందరు పెన్షన్ అందుకుంటున్నా ఆ డబ్బులు సరిపోక గ్రామాలు తిరుగుతూ పొట్ట పోసుకుంటున్నారు.

కళలకు ప్రాధాన్యమివ్వాలి



కళలకు ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాలి. జముననగర్‌లో తోలుబొమ్మలాటపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వ పథకాలను ఈ తోలుబొమ్మలాటద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా సహాయం అందాలి.

-తోట పవన్‌కుమార్, గోల్డ్ మెడల్ లిస్ట్, ప్రముఖ తోలుబొమ్మలాట కళాకారుడు

కళాకారులకు న్యాయం చేయాలి



ప్రభుత్వం పేద జానపద కళాకారులను ఆదుకుని న్యాయం చేయాలి. కనుమరుగవుతున్న కళలను తర్వాత తరానికి అందించేలా చర్యలు చేపట్టాలి. కళాకారుల గుర్తింపులో ప్రభుత్వం ప్రధాన భూమి క పోషించాలి.

-పక్కి మణిబాల, జానపద కళాకారిణి

పూర్వ వైభవం తీసుకురావాలి



గతంలో కళలద్వారా జీవనపాధి పొందేవారు.ఇప్పుడు ప్రభుత్వ పథకాల ప్రచారానికి మాత్రమే ఉపయోగపడుతున్నాయి. కళలకు పూర్వ వైభవం తీసు కురావాలి. కవులు, గాయకులు, కళాకారులు ఏకం కావాలి.

-కెర్ల పుల్లారావు, నంది అవార్డు గ్రహీత, జానపద కళాకారుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బొత్స

వైసీపీ.. జగన్.. ఇదే పాట పాలన ఏముంది?

- కూటమి ప్రభుత్వంపై బొత్స విమర్శలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం 14నెలల పాలనలో వైసీపీ..జగన్.. ఇదేపాట. విమర్శలు తప్ప, పాలన, పర్యవేక్షణలేదని శాసన మండలి వైసీపీ పక్షనేత బొత్స సత్యనారాయణ విమర్శించారు. స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వంద రోజులలో రోడ్ల గోతులన్నీ పూడ్చేస్తామని చెప్పారని, ఏ రోడ్డూ బాగోలేదని, 20శాతం రోడ్లు కూడా వేయలేదన్నారు. ఉపాధి కూలీలకు 7వారాలుగా జీతాలు ఇవ్వకపోతే, ఎలా బతుకుతారని ఆయన ప్రశ్నించారు. ఇంటింటికీ కుళాయి పనులు ఆపేశారని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, ఐదేళ్లలో వైసీపీ పాలన, 14నెలల కూటమి పాలనలో క్రైమ్ రేట్ బేరీజ్ వేసుకుంటే ప్రజలకు అర్థం అవుతుందన్నారు. ఇదేనా మంచిపాలన. ప్రజలకు తెలియాలని, భూకబ్జాలు, దోపిడీ లు పెరిగిపోయాయన్నారు. ఏదైనా మాట్లాడితే కేసులు పెడుతు న్నారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి పీడీఎస్ బియ్యం అక్రమాలను అరికడతామని చెప్పారుకదా, ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలు సింగపూర్ పెట్టుబడుల కోసం వెళ్లలేదని, అక్కడ పెట్టుబడులు పెట్టడానికి వెళ్లారని ఆరోపించారు. పీ4 విధానంపై ప్రభుత్వానికే స్పష్టతలేదని విమర్శించారు. ఈసమావేశంలో మాజీ ఎంపీ మార్గాని భరత్, మా జీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, శ్రీనివాసనాయుడు, పార్టీనేతలు గూడూరి శ్రీనివాసరావు, జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొన్నారు.

వీరేశ్వరస్వామికి లక్ష రుద్రార్చన



వీరేశ్వరస్వామి సన్నిధిలో లక్ష రుద్రాక్షలు

ఐ.పోలవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసశివరాత్రిని పురస్కరించుకుని మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామికి గురువారం లక్ష రుద్రాక్ష పూజ జరిగింది. ఆలయ అర్చకుడు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో 15మంది రుత్విక్కులతో లక్షరుద్రార్చన నిర్వహించారు. పుణ్యక్షేత్రం వారణాసి నుంచి తీసుకొచ్చిన రుద్రాక్షలను ఊరేగింపుగా గోదావరి తీరానికి తీసుకెళ్లి గోదావరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాక్షలకు సంప్రోక్షణ నిర్వహించారు.

వైభవంగా శ్రీపాదుల గ్రామోత్సవం

- పిఠాపురంలో శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం



పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభుల వారి గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు, ప్రత్యేక అలంకారంలో సర్వపుష్పపూజ అనంతరం శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులు

పిఠాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పిఠాపురంలో శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాద శ్రీవల్లభుల వారి మహిమాన్విత దివ్య పాద పద్మాలకు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్రనామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్టానము, గణపతి అధర్వ ఉపనిషత్ పారాయణ, శ్రీగురుచరిత్ర పారాయణ, శ్రీపాదశ్రీవల్లభ చరిత్ర పారాయణ నిర్వహించారు. సాయంత్రం అగ్ని ప్రతిష్ఠాపన, దత్త మంత్రహోమం, శ్రీపాద శ్రీవల్లభుల వారి దివ్య పాద పద్మాలకు వివిధ హారతులు, పల్లకీ సేవ జరిగాయి. సాయంకాలార్చన, మంగళహారతి నిర్వహించారు. సర్వపుష్ప పూజ అనంతరం శ్రీపాద శ్రీవల్లభులు, దత్తాత్రేయుడు, నృసింహ సరస్వతులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం శ్రీపాదుల గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఈవో ఆర్. సౌజన్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీటీడీని భ్రష్టు పట్టించిన వైసీపీ

- పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నెహ్రూ

కాకినాడసిటీ, ఆగస్టు 21(ఆంధ్ర జ్యోతి): టీటీడీని భ్రష్టుపట్టించింది వైసీపీయేనని, దేవస్థానంపై ఆపార్టీ బురద చల్లే ప్రయత్నం చేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ ధ్వజమెత్తారు. కాకినాడలోని టీడీపీజిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదు రోజులుగా వైసీపీ చేస్తున్న ఆరోపణలన్నీ పూర్తి అవాస్తవాలన్నారు. అధికారంలో ఉండగా వేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలు, కల్యాణ వస్త్రాలు కుటుంబ సమేతంగా సమర్పించని జగన్మోహన్ రెడ్డి, కరుణాకరరెడ్డి టీటీడీ పవిత్రత గురించి మాట్లాడ్డం విడ్డూరంగా ఉందన్నారు. కరుణాకరరెడ్డి చైర్మన్‌గా ఉన్నప్పుడు తిరుపతిలో కారు డ్రైవర్లు దర్శనం టిక్కెట్లు అమ్మేవారన్నారు. తిరుమల లడ్డూ ఒక రోజులో పాడైపోయేదని, అన్నప్రసాదాన్ని కూడా పాలకమండలి భక్తులకు పూర్తిగా పెట్ట లేదన్నారు. ప్రొటోకాల్ తప్ప కొండపై ఎటువంటి సదుపాయాలు ఉపయోగించుకోని ప్రస్తుత చైర్మన్ బీఆర్ నాయుడువల్ల తిరుమల మసక బారుతోందని ఆరోపణలు చేస్తున్న వైసీపీ త్వర లోనే మసకబారనుందన్నారు. తిరుమల కొండ పై ఉన్నది నల్లరాయి... దానిని పూజిస్తే ఏం వస్తుందని మాట్లాడిన నాస్తికుడైన కరుణాకర రెడ్డి ఏనాడూ బొట్టు పెట్టుకోలేదన్నారు. టీటీడీ పవిత్రత గురించి మాట్లాడే నైతికత వైసీపీకి లేదన్నారు. తిరుమలలోని అన్యమత ఉద్యోగులకు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ, వేరే శాఖల్లోకి మారే అవకాశాన్ని పాలకమండలి కల్పించిందన్నారు. సామాన్య భక్తులకు రెండు, మూడు గంటల్లోనే దర్శనం కల్పించేలా సాంకేతికతను ఉపయోగించుకోనుందన్నారు. ఈ సమావేశంలో జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్‌బాబు, జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యుడు భూపాలపట్నం ప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజన విజ్ఞానాన్ని పరిరక్షించుకుందాం

- నన్నయ ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గిరిజనవిజ్ఞానాన్ని పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. నన్నయ వర్సిటీ విద్యా కళాశాల ఆధ్వర్యంలో గిరిజన ప్రాచీన విజ్ఞాన పరిరక్షణ భవిష్యత్ తరాలకు చేర్చడం అనే అంశంపై రెండురోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ గతాన్ని కాపాడుకోవడం ద్వారా భవిష్యత్ శక్తివంతంగా మారుతుందన్నారు. మన దేశీయ జ్ఞానం స్థిరమైన జీవనానికి కీలకమని చెప్పారు. స్థానిక సంఘాలను సాధికారపరచాలని, గిరిజన సంఘాలు, సాంప్రదాయ వైద్యులు, జానపద కళాకారులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గిరిజన సంస్కృతి, విజ్ఞానం, పరిరక్షణ నుంచి సాధికారత వరకూ విశ్వవిద్యాలయాలు కృషి చేయాలన్నారు. సదస్సుకు సంబంధించిన 39 పరిశోధనపత్రాలతో ప్రచురించిన పుస్తకాలను, గిరిజన తొలి స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలను వీసీ ఆవిష్కరించారు. విద్యాకళాశాల, రాజమహేంద్రవరం ట్రైనింగ్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యూఢిల్లీలోని గిరిజన తెగల జాతీయ కమిషన్ ముద్రించిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు, గిరిజన హక్కులు చిత్రపటాల ప్రదర్శనను ఆంధ్ర వనవాసీ కళ్యాణ శ్రమ సహకారంతో ఏర్పాటుచేశారు. దీనిని వీసీ ప్రారంభించి ఇతోపియా విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన థెసిమా గబ్రెకు ఇరాక్ నుంచి వచ్చిన బతుల్ అలీకు గిరిజన స్వాతంత్ర్యవీరులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ఏయూ నుంచి ఆచార్య వి.సుబ్రహ్మణ్యం, కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం పరిపాలనాధికారి ఎస్‌వీఎస్ సూర్యనారాయణ, ఒరిస్సా కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి ఇ.అశోక్‌కుమార్, హరిశంకర్ గౌర్ కేంద్రీయ విద్యాలయం నుంచి పి.చిట్టిబాబు, పలువురు నన్నయ వర్సిటీ అధికారులు పాల్గొన్నారు.





పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, గిరిజన వీరుల చిత్రప్రదర్శనను తిలకిస్తున్న వీసీ, విదేశీ అధ్యాపకులు



సత్యదేవుడి దర్శనానంతరం ఎమ్మెల్సీ కల్యాణి, మాజీ మంత్రి రోజా

సత్యదేవుడి సన్నిధిలో మాజీ మంత్రి రోజా, ఎమ్మెల్సీ కల్యాణి పూజలు

అన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గురువారం మాజీమంత్రి ఆర్.కె రోజా, ఎమ్మెల్సీ వరుది కల్యాణి కుటుంబసభ్యులతో స్వామి వారి వ్రతమాచరించి ప్రత్యేకపూజలు నిర్వహిచి దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత లక్ష్మణరావు

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి గురువారం ఒకదాత రూ. 1,01,116లు విరాళంగా సమర్పించారు. తణుకుకు చెందిన కాటూరి లక్ష్మణరావు, విజయ వెంకటలక్ష్మి దంపతులు ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శనం కల్పించారు.

ఎమ్మెల్యేతోపాటు సమానంగా భాగస్వామ్యం కల్పించాలి

- 'పిల్లి'ని బుజ్జగించిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ



మాట్లాడుతున్న టీడీపీ కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్యే వర్మ

సర్పవరం జంక్షన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనుల్లో ఎమ్మెల్యేతోపాటు సమానంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పిస్తేనే కేడర్, ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఈవిషయంపై టీడీపీ అధిష్టానం నిర్దిష్ట వైఖరి చెప్పాలని పిల్లి సత్యనారాయణ మూర్తి డిమాండ్ చేశారు. టీడీపీ కో-ఆర్డినేటర్ పదవికి ఆయన రాజీనా మా చేసిన నేపథ్యంలో అధిష్ఠానం ఆదేశం మేరకు ఆయన్ని బుజ్జగించేందుకు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ గురువారం వలసపాకలలోని నివాసంలో కలుసుకున్నారు. మండల శాఖ అధ్యక్షుడి ఎంపికపై పార్టీ కోఆర్డినేటర్, పార్టీ పరిశీలకుల వైఖరి కారణంగా చోటు చేసుకున్న పరిణామాలు, జనసేన ఎమ్మెల్యే నుంచి టీడీపీకి ఎదురవుతున్న సహాయ నిరాకరణ వంటి విష యాలను పిల్లి సత్యనారాయణమూర్తి వివరించారు. అధికారంలో ఉండి పార్టీ కార్యకర్తలు, ప్రజలకు ఏమీ చేయలేని స్థితిలో కోఆర్డినేటర్‌గా కొనసాగడం ఇష్టంలేక ఈ పదవికి రాజీనామా చేశామ ని, క్రియాశీలక కార్యకర్తగా కొనసాగుతానని స్పష్టం చేశారు. టీడీపీలో అత్యంత సీనియర్, ఉమ్మడి జిల్లాలోనే శెట్టిబలిజ సామాజిక వర్గంలో బలమైన నాయకుడు సత్యనారాయణమూర్తి అని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు. కూటమినాయకుల మధ్య కొన్ని సమస్యలు ఉండటం సహజమన్నారు. వీటి ని కూర్చుని పరిష్కరించుకుంటామన్నారు. పార్టీ అధిష్టానం, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీని వాసరావు, ఇన్‌చార్జి మంత్రి నారాయణల ఆదేశాలమేరకు సత్యనారాయణ తో చర్చిం చేందుకు వచ్చామన్నారు. మండలపార్టీ ఎన్నిక వాయిదా వేశామని, త్వరలో ఇద్దరు పార్టీ సీనియర్ పరిశీలకులతో పూర్తి పారదర్శకంగా కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. వారంరోజుల్లో సీఎం చంద్రబాబుతో పిల్లి దంపతులతో సమావేశమయ్యామన్నారు. నియోజకవర్గంలో ఉన్న సమస్యలను పార్టీపెద్దల దృష్టికి తీసుకెళ్లామన్నారు.

గోదావరి ఉగ్రరూపం

● ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ ● రెండో ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటిమట్టం
● పునరావాస కేంద్రాలకు లోతట్టు ప్రాంతాల జనం తరలింపు ● అప్రమత్తమైన యంత్రాంగం



ధవళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది

గోదావరి ఉప్పొంగుతోంది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలతో ఇక్కడ ఉధృతి పెరుగుతోంది. నీటిమట్టం పెరగడంతో ధవళేశ్వరంలో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. 11 లక్షలకు పైగా క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేశారు. దీంతో కోనసీమలోని గౌతమి, వృద్ధగౌతమి, వైనతేయ, తదితర నదీపాయల్లోకి వరదనీరు వచ్చి చేరడంతో ఆత్రేయపురం, అలమూరు, రావులపాలెం, కె.గంగవరం, అయినవిల్లి, మామిడికుదురు, పి.గన్నవరం, ముమ్మిడివరం తదితర ప్రాంతాల్లో వరద పోటెత్తింది. ముమ్మిడివరంలో కూరగాయల పంటలు, కొబ్బరితోటలు నీటమునిగాయి. పి.గన్నవరం మండలం లో కనకాయలంక కాజ్‌వే పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకోగా ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. ఏజెన్సీలోనూ శబరి, సీలేరు నదులకు వరద పోటెత్తడంతో చింతూరు, వర రామచంద్రపురం, ఎటపాక, కూనవరం, తదితర ప్రాంతాల్లో లోతట్టు గ్రామాలు నీటమునిగాయి.

ధవళేశ్వరం, ఆగస్టు21 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో ధవళేశ్వరం వద్ద గోదావరి అంతకంతకూ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి పెరుగుతున్న నీటిమట్టం గురువారం ఉదయం 6.50 గంటలకు 11.75 అడుగులకు చేరడంతో ఫ్లడ్ కంజర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 9.85 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి వదిలారు. ఆపై గంటకు సరాసరి 10 వేల క్యూసెక్కులు చొప్పున ప్రవాహం పెరుగుతూ రెండో ప్రమాద హెచ్చరిక దిశగా ఉరకలేస్తోంది. గురువారం రాత్రి ఏడుగంటలకు నది నీటిమట్టం 13 అడుగులకు చేరుకోగా, 11,65, 473 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి ప్రవహిస్తోంది. రాత్రి పది గంటలకు 13,30 క్యూసెక్కులుకు చేరుకుంది. అర్ధరాత్రి దాటిన తరువాత నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక స్థాయి 13.75 అడుగులకు చేరుకుంటుందని అధికారుల అంచనా. ఇదే సమయంలో పరీవాహక ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరే వరద తగ్గడంతో కాళేశ్వరం, పేరూరు వద్ద నీటిమట్టం తగ్గుతుండగా, భద్రాచలం వద్ద నిలకడగా కొనసాగుతోంది. రాత్రి పది గంటలకు 52 అడు గులు తగ్గింది.

● ఎగువన భద్రాచలం వద్ద బుధవారం ఉదయం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ కాగా 13 గంటల వ్యవధిలో రాత్రి 10 గంటలకు నీటి మట్టం 48.10 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యింది. ఆపై క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం గురువారం సాయంత్రం 5 గంటలకు 52.10 అడుగులకు చేరుకుని నిలకడగా కొనసాగుతోంది

● ఎగువ నీటిమట్టాలు ఇవే...

ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం తగ్గుదల నమోదయ్యింది. గురువారం సాయంత్రం 6 గంటలకు కాళేశ్వరం వద్ద 10.85 మీటర్లు, పేరూరు వద్ద 16.60 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 14.14 మీటర్లు, భద్రాచలం వద్ద 52.10 అడుగులు, కూనవరం వద్ద 20.25 మీటర్లు, కుంట వద్ద 11.37 మీటర్లు, పోలవరం వద్ద 12.84 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 16.39 మీటర్లుగా నీటిమ ట్టం నమోదయింది.

●డెల్టా కాలువలకు 9100 క్యూసెక్కులు

డెల్టా పరిధిలో వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండ తీవ్రత పెరుగుతుండటంతో వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు నీటి విడుదలను పెంచారు. తూర్పుడెల్టాకు 3800 క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1500క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 3800 క్యూసెక్కులు చొప్పున మొత్తం 9100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

కొవ్వూరు: నదీ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ నుంచి అధికంగా వరద రావడంతో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని స్నానఘట్టాలు పూర్తిగా నీట మునిగాయి. ఎగు వన భద్రాచలం, దిగువన ధవళేశ్వరం బ్యారేజీల వద్ద ప్రమాద హెచ్చరికలు దాటి నది ఉప్పొంగుతోంది. వరద మరింత పెరిగితే శుక్రవారం ఉదయానికి ప్రవాహం గోష్పాదక్షేత్రంలోకి చేరే అవకాశం ఉంది. డివిజనల్ పరిధిలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు.

సఖినేటిపల్లిరేవులో రాకపోకలు బంద్

అంతర్వేది: వరద ఉధృతి పెరగడంతో సఖినేటిపల్లి-నర్సాపురం రేవులో రాకపోకలను గురువారం ఉదయం నుంచి నిలిపివేశారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే సఖినేటిపల్లిరేవు పంట్లు, పడవలను నిలుపుదల చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. మరో పక్క ఇప్పటికే కలెక్టర్ ఆదేశాల మేరకు దిండి-చించినాడ వంతెనపై రాకపోకలు నిలుపుదలచేస్తూ సర్క్యులర్ ఇవ్వగా, వరద నేపథ్యంలో సఖినేటిపల్లి రేవులో కూడా రాకపోకలను బంద్ చేయడంతో వెంటనే స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ కలెక్టర్, పోలీసు అధికారులతో మాట్లాడి వంతెనపై ఆంక్షలు సడలించి వాహనదారులకు అనుమతిచ్చారు. దీంతో ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ఏజెన్సీలోనూ అదే పరిస్థితి..



కూనవరం చుట్టూ చేరిన వరద నీరు

చింతూరు: చింతూరు వద్ద గోదావరి వరద ఉధృతి గురువారం మరింతగా పెరిగింది. భద్రాచలం వద్ద గురువారం రాత్రి ఎనిమిది గంటలకు 51.90 అడుగుల మేర ప్రవహిస్తోంది. కూనవరం వద్ద గోదావరి 47 అడుగులు, చింతూరు వద్ద శబరి నది 37 అడుగుల మేర ప్రవహిస్తోంది. దీంతో చిం తూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో ఎటుచూసినా వరద నీరే కనిపిస్తోంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 30వ నెంబరు జాతీయ రహదారిపై నీరు చేరడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనాలు చింతూరు మండలం ఎర్రంపేట వద్ద బారులు తీరాయి. ఈమండలాల్లో నాలుగు రోజులుగా లోతట్టు వాసులు జల దిగ్బంధంలోనే ఉన్నారు. 326వ నెంబర్ జాతీయ రహదారిపై నెల్లిపాక సమీపంలో వరద నీరు వచ్చి చేరడంతో చింతూరు నుంచి భద్రాచలం వెళ్లే వాహనాలు వయా లక్ష్మీపురం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వరద కారణంగా చింతూరు మండలంలో ఎనిమిది గ్రామాలకు, కూనవరం మండలంలోని పది గ్రామాలకు, వర రామచంద్రపురం మండలంలో 12 గ్రామాలకు, ఎటపాక మండలంలో పన్నెండు గ్రామాలకు వెళ్లే రహదారులు నీట మునిగినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. శ్రీరామగిరి, రామవరం, జీడిగుప్ప, చిన్నమట్టపల్లి, తుమ్మిలేరు గ్రామ పంచాయతీల పరిధిలోని 28 గ్రామాలకు చెందిన ప్రజలు వరద ప్రభావాన్ని ఎదుర్కొంటున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఎప్పటికప్పుడు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు.



గంటిపెదపూడి బూరుగులంక నదిపాయలో బోటు నుంచి విద్యార్థులను దింపుతున్న అగ్నిమాపక సిబ్బంది

ప్రమాదకరంగా లంక గ్రామాలు

పి.గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పోటెత్తడంతో దిగువన నదీపాయలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. దీంతో లంకగ్రామాల్లోకి నీరు నెమ్మదిగా వచ్చి చేరు తోంది. పి.గన్నవరం మండలంలోని బూరుగులంక నదిపాయ ఉధృతంగా ప్రవహించడంతో ఐలాండ్‌పై ఉన్న ఉడి మూడిలంక, పెదపూడి లంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు, విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదకర ప్రవాహంలో నదీపాయ దాటడానికి భయాందోళనకు గురవుతున్నారు. వరదనీరు ఏటిగట్టును తాకుతూ... చెంతనే ఉన్న మినీ కాజ్‌వే పైకి చేరుతోంది. కనకాయలంక కాజ్‌వే పూర్తి జలదిగ్బంధంతో లంకగ్రామంలోని ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. మానేపల్లి శివారు శివాయిలంకకి వెళ్లే రహదారిపైకి వరద వచ్చి చేరుతోంది. పల్లిపాలెంలో నెమ్మదిగా ఇళ్ల వద్దకు చేరుకుంటోంది. పశ్చిమగోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక, అయోధ్యలంక వాసులు నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు.

రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్- 2025లో

ప్రథమ బహుమతి విజేత అమలాపురం టీమ్



నగదు బహుమతిని అందుకుంటున్న అనిల్ అండ్ శ్రీ టీమ్

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం హోటల్ మంజీరాలో భవాని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో నిర్వహించిన రాజమండ్రి ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్-2025లో 150 టీమ్‌లు వారి ఆవిష్కరణలతో హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు హాజరుకాగా, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జనసేన రాజమహేంద్రవరం నగరం అధ్యక్షుడు వై. శ్రీను, తదితరులు పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో ప్రథమ బహుమతిని అమలాపురానికి చెందిన అనిల్ అండ్ శ్రీ టీం హెల్ప్‌టూ డిసబుల్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. ఇందుకుగాను ప్రథమ బహుమతి కింద రూ.లక్షా 75 వేలు నగదు చెక్కును ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి అందించారు. అదేవిధంగా ద్వితీయ బహుమతిని విశాఖపట్నంకు చెందిన చెన్న వైష్ణవి, శంకర్ డిటీమ్‌పేజ్‌ ప్రాజెక్టుకు కైవసం చేసుకుంది. దీనికి రూ.లక్ష నగదు చెక్కును అందించారు. అలాగే తృతీయ బహుమతికి శ్రీకాకుళంకు చెందిన సాయికిరణ్ రూపొందించిన డ్యూయల్ అలెర్ట్ సిస్టమ్ ప్రాజెక్టు కైవసం చేసుకుంది. బహుమతిగా రూ.75 వేలు నగదు చెక్కును అందించారు.

గంజాయి మత్తులోనే హత్యలు?

● పోలీసులకు లొంగిపోయిన నిందితుడు కోటేశ్వరరావు



కోటేశ్వరరావు

నల్లజర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలోని ఘంటవారిగూడెంలో సంచలనం సృష్టించిన దంపతుల హత్య కేసులో నిందితుడు, గంగన్నగూడెంకి చెందిన మారిదు కోటేశ్వరరావు గురువారం నల్లజర్ల పోలీసులకు లొంగిపోయాడు. గంజాయి మత్తు లోనే దారుణానికి పాల్పడినట్టు స్థానికులు పేర్కొంటున్నారు. అత్తమామలను చంపిన అనంతరం నిందితుడు తన తల్లికి ఫోన్ చేసి మాట్లాడుతూ తన అత్తమామలను నరికి చంపేశాను. మూడు నెలలు జైల్లో ఉండి వస్తాను... నువ్వు కంగారు పడొద్దని సంఘటనా స్థలం నుంచే మాట్లాడినట్టు అక్కడివారు చెబుతున్నారు. కాగా, మామ ఏకుల సుబ్బారావు, శారద మృతదేహాలకు గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

మావోయిస్టులపై మరో ఏడాది ..

నిషేధం పొడిగింపు

● ప్రజా రక్షణ చట్టం మేరకు అసాంఘిక చర్యలపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
● మావోయిస్టు అనుబంధ సంఘాలు, సంస్థలపైనా ...

రంపచోడవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు), దాని అనుబంధ సంఘాలు, సంస్థలపై ఇప్పటివరకూ అమలులో ఉన్న నిషేధాన్ని మరో ఏడాదిపాటు పెంచుతూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రజా రక్షణ చట్టం, 1992 ప్రకారం ఈ నిషేధాజ్ఞలను ప్రభుత్వం జారీచేసింది. 2005 ఆగస్టు 17న ప్రభుత్వం రాష్ట్రంలో తొలిసారిగా మావోయిస్టులు, వారి అనుబంధ సంఘాలు, వ్యవస్థలపై నిషేధాన్ని విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి ఏటా ఈ నిషేధాన్ని పొడిగించడం రివాజు. ఆ ప్రకారం ఈనెల 17 నుంచి మరో ఏడాది పాటు పొడిగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. అసాంఘిక సంఘంగా మావోయిస్టు పార్టీ, విప్లవ కార్మిక సమాఖ్య, సింగరేణి కార్మిక సమాఖ్య, రాడికల్ యూత్ లీగ్, రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, రైతు కూలీ సంఘం, ఆలిండియా రివల్యూషనరీ యూత్ ఫెడరేషన్, రివల్యూషనరీ డెమొక్రటిక్ ఫ్రంట్ తదితర సంఘాలపై ఈ నిషేధాజ్ఞలు మరో ఏడాదిపాటు కొనసాగుతున్నాయి.

ఆలయాలే అతడి టార్గెట్

» పాత నేరస్థుడి అరెస్ట్
» కిలో బంగారం స్వాధీనం
» కాకినాడ ఎస్పీ బిందుమాధవ్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గుళ్లు, గోపురాలే అతడి టార్గెట్. రద్దీగా ఉండే ప్రాంతాల్లో పార్కింగ్‌లో వాహనాలుంటే చాలు చేతికి పని చెప్తాడు. ఆ విధంగా గతేడాది, ఈ ఏడాది కలిపి ఐదు నేరాలకు పాల్పడ్డాడు. చివరికి అతని పాపం పండి కాకినాడ పోలీసులకు చిక్కాడు. నిందితుడి వద్ద నుంచి సుమారు కిలో బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్పీ జి.బిందుమాధవ్ వెల్లడించారు. బుధవారం సాయంత్రం అన్నవరం కొండపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులు అనుమానాస్పదంగా ఎర్టిగా కారులో ఉన్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. అతడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరు గ్రామానికి చెందిన 47 ఏళ్ల చింతా గణేష్‌గా నిర్ధారించారు. అతడు కారు డ్రైవర్.వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బులు సంపాదించాలని నేరాలను ప్రవృత్తిగా మార్చుకున్నాడు. 2020లో సాదాసీదాగా తన మొదటి దొంగతనాన్ని ప్రారంభించాడు. రద్దీ ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉన్న కార్లపై దృష్టి పడింది. 2024లో అన్నవరం కొండ మీద పార్క్ చేసి ఉన్న కారు డిక్కీలో భద్రపర్చిన సుమారు 257 గ్రాముల బంగారం, తిమ్మాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కారు డిక్కీలో నుంచి సుమారు 349.44 గ్రాముల బంగారం, పశ్చిమగోదావరి జిల్లా ద్వారకా తిరుమల ఆలయం వద్ద కారు డిక్కీలో నుంచి సుమారు 183 గ్రాముల బంగారం అపహరించాడు. 2025లో తిమ్మాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆగి ఉన్న కారు డిక్కీలో నుంచి సుమారు 155 గ్రాముల బంగారం తస్కరించాడు.బుధవారం అన్నవరం దేవస్థానం కొండపై పెళ్లిళ్లు ఎక్కువగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పడిన రద్దీతో కారు డిక్కీలో నుంచి సుమారు 45 గ్రాముల బంగారాన్ని దొంగిలించి కారులో పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా సీఐ సూర్యఅప్పారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు శ్రీహరిబాబు, ప్రసాద్‌లు.. సిబ్బందితో గణేష్‌ను పట్టుకున్నారు. అతడిపై అన్నవరంలో 2, తిమ్మాపురంలో 2,ద్వారకా తిరమలలో ఒక కేసు ఉన్నాయని, ఈ కేసుల్లో నిందితుడి నుంచి 989.44 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ పేర్కొన్నారు. నిందితుడ్ని పట్టుకోవడంలో కృషి చేసిన సీఐ సూర్యఅప్పారావు,ఎస్ఐలు శ్రీహరిబాబు, ప్రసాద్, సాంకేతికతను అందించిన ఐటీ కోర్ టీమ్ సీఐ డి.దుర్గాశేఖర్‌రెడ్డి,వారి సిబ్బందికి ఎస్పీ నగదు ప్రోత్సాహకాలు అందజేసి అభినందించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారం

టిక్కెట్ల జారీలో గందరగోళం

» నేడు పిఠాపురం పాదగయలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు
» తోపులాటలో భక్తురాలికి గాయాలు
» ఉదయం నుంచి భక్తుల పడిగాపులు
» నేతలను నిలదీసిన మహిళలు





టిక్కెట్ల కోసం నిరీక్షిస్తున్న మహిళలు, గాయపడిన మహిళ

పిఠాపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరగనున్నాయి. వ్రతాల్లో పాల్గొనే మహిళలకు అందించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పది వేల చీరలు, పసుపు, కుంకుమ సమకూర్చారు. పూజా సామగ్రిని సిద్ధం చేశారు. ఏర్పాట్లను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పర్యవేక్షించారు. గురువారం మధ్యాహ్నం, సాయంత్రం రెండు విడతలుగా మహిళలకు టిక్కెట్లు జారీ చేశారు. కాగా ఈ ప్రక్రియ గందరగోళంగా మారింది. ఏర్పాట్ల విషయంలో ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టిక్కెట్లు ఎప్పుడు జారీ చేస్తారో స్పష్టంగా తెలపకపోవడంతో పిఠాపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు తెల్లవారు జాము నుంచే పాదగయకు తరలివచ్చి క్యూలైన్లలో బారులు దీరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో టిక్కెట్ల జారీ ప్రారంభించారు. సగం మందికి టిక్కెట్లు పంపిణీ చేసి అయిపోయాయని చెప్పడంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో పద్మావతి అనే మహిళకు గాయాలు కాగా పలువురు కిందపడిపోయారు. పది వేల మందికి వ్రతాలు అని చెప్పి టిక్కెట్లు లేవని చెప్పడం ఏమిటంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాదగయ ఆవరణలోనే ఉండిపోయారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబును చుట్టుముట్టారు. ఇతర నాయకులను నిలదీశారు. తుమ్మల బాబు అప్పటికప్పుడు టిక్కెట్లు తెప్పించి పంపిణీ చేశారు. మొత్తం ఈ వ్యవహారంలో జనసేన నాయకులు, దేవదాయ, పోలీసు శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం కనిపించింది.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

ఏసీబీకి చిక్కిన ఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్



కమిషనర్ సత్యనారాయణ, అరుణాచలం

ఏలేశ్వరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం అవినీతి నిరోధకశాఖ అధికారులు గురువారం ఏలేశ్వరం నగర పంచాయతీ కమిషనర్ ఎం.సత్యనారాయణను అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి అరుణాచలంపై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు ఏసీబీ డీఎస్పీ కిషోర్‌కుమార్ గురువారం వెల్లడించారు. నాలుగేళ్ల క్రితం పట్టణంలో కృష్ణాలయం వీధిలో అర్బన్ హెల్త్ ప్రైమరీ క్లినిక్‌ను, 2017లో సీసీ రోడ్లను కాంట్రాక్టర్ టి.రాజబాబు నిర్మించారు. ఈ పనులకు సంబంధించి రూ.8.05 లక్షలు కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంది. ఈ బిల్లులు మంజూరు చేయాలంటే 3శాతం కమీషన్ ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేశాడు. రూ.23 వేలకు ఒప్పందం కుదిరింది. ఆ సొమ్మును ఇవ్వడం ఇష్టం లేని రాజబాబు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. సదరు సొమ్మును డేటా ఎంట్రీ ఆపరేటర్ (అవుట్ సోర్సింగ్) అరుణాచలానికి అతడి నివాసం వద్ద రాజబాబు అందజేస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా కమిషనర్ కోరిక మేరకు నగదు తీసుకున్న నేపథ్యంలో ఇద్దరిపై కేసు నమోదు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలిస్తున్నామని డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కాకినాడ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం శ్రీనివాసానగర్ నాల్గవ వీధిలో పాడుపడి శిథిలావస్థకు చేరిన ఇంటి విద్యుత్ వైర్లు తగిలి వర్షపు నీటిలో సుమారు 35 ఏళ్ల పురుషుడి మృతదేహం కుళ్లిన స్థితిలో లభ్యమైందని ఇంద్రపాలెం ఎస్ఐ ఎం.వీరబాబు తెలిపారు.వీఆర్వో ఇచ్చిన రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేశామని,సదరు వ్యక్తి చెత్త ఏరుకుంటూ ఆ ఇంటి లోపలికి ప్రవేశించి విద్యుత్ వైర్లు తగిలి మరణించి ఉంటాడని అనుమానిస్తున్నామన్నారు. మృతదేహం గుర్తుపట్టడానికి వీలులేకుండా కుళ్లి ఉందన్నారు.దేహంపై ఎరుపు రంగు పొడవాటి చేతుల టీషర్ట్, బూడిద రంగు ఫ్యాంటు ఉన్నాయన్నారు. ఎవరికైనా ఆ వ్యక్తి ఆచూకీ తెలిస్తే ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌కు లేదా 0884 -2363037 నెంబరుకు సమాచారమివ్వాలని సూచించారు.

డ్రైన్‌లో వ్యక్తి మృతదేహం

మండపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండపేట బైపాస్ రోడ్డులోని డ్రైన్‌లో ఓ మృతదేహాన్ని స్థానికులు గురువారం గుర్తించారు. వారి సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కాగా మృతుడు మండపేటకు చెందిన ఉప్పాడ అశోక్‌గా గుర్తించామని ఎస్ఐ రాము తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

బిక్కవోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు-ఊలపల్లి రోడ్డులో గురువారం మధ్యాహ్నం ఆటో ఢీకొని ఊలపల్లికి చెందిన రెడ్డి సూర్యభాస్కరరావు(34) మృతి చెందాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం.. సూర్యభాస్కరరావు ఉదయం ఊలపల్లి, బిక్కవోలు గ్రామాల మధ్యలో వున్న తన పొలానికి వెళ్లి పశువులకు గడ్డి కోసుకుని గ్లామర్ బైక్‌పై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యంలో ఊలపల్లి నుంచి బిక్కవోలు వస్తున్న ఆటో ఢీకొట్టింది. ఈ ఘటనలో సూర్యభాస్కరరావు తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడిని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవిచంద్రకుమార్ పేర్కొన్నారు.

ముగ్గురు ఇంజనీర్లకు షోకాజ్‌లు జారీ

» పోలవరం పునరావాస కాలనీల్లో అక్రమాలపై ప్రభుత్వ కొరడా
» విజిలెన్సు విచారణలో నాణ్యతా లోపాల గుర్తింపు

రంపచోడవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోలవరం జాతీయ ప్రాజెక్టులో గిరిజన నిర్వాసితుల పునరావాస కాలనీల్లో మౌలిక వసతుల కల్పన చర్యల్లో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగం ద్వారా దేవీపట్నం, కూనవరం, వీఆర్ పురం మండలాల్లో చేపట్టిన పనులన్నిటిపైనా జరిగిన విజిలెన్సు విచారణలో అనేక అక్రమాలు వెలుగు చూశాయి. నాణ్యతా ప్రమాణాలు లేకుండా ఆయా కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లింపు జరిగేలా సిఫార్సు చేసిన అప్పటి ఇంజనీర్లపై చర్యలను చేపట్టింది. ఈ మేరకు ముగ్గురు ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలకు ప్రభుత్వం గురువారం నాలుగు వేర్వేరు ఉత్తర్వులను జారీ చేసింది. దేవీపట్నం మండలంలోని నేరేడువలస, మునశ్లకుంట, కంబలంపాలెం, పోలవరం పునరావాస కాలనీల్లో 465 మంది నిర్వాసితుల కోసం సుమారు రూ.53 కోట్లతో చేపట్టిన అంతర్గత రోడ్లు, భవనాలు, డ్రైనేజీల నిర్మాణాల్లో నాణ్యతాలోపాలతో పనులు జరిగాయి. వీటిపై జరిగిన విజిలెన్సు తనిఖీల్లో లోపాలు బయటపడ్డాయి.పలు పనుల్లో నాణ్యతా లోపాలు జరిగి ఆయా బిల్లుల చెల్లింపునకు అనర్హంగా ఉన్నా వాటి చెల్లింపునకు అప్పటి ఈఈలు పి.రమాదేవి, జి.డేవిడ్ రాజు, డీఈఈ ఐ.శ్రీనివాసరావు సిఫార్సులు చేశారు. తదుపరి ఆయా లోపాలను సరిచేయడం ద్వారా ప్రభుత్వంపై అదనపు భారం పడింది.తద్వారా నిధుల దుర్వినియోగానికి ఆయా ఇంజనీర్లు కారణమయ్యారు.ఈ అంశాలను గుర్తించిన విజిలెన్సు అధికార్లు ప్రభుత్వానికి నివేదిక సమర్పించడంతో ఆయా కాలనీల వారీగా ప్రభుత్వం చర్యలను చేపట్టింది. ఇందులో భాగంగానే ఈ ముగ్గురు ఇంజనీర్లపై శాఖాపరమైన చర్యలను చేపట్టి వారి నుంచి సంజాయిషీ కోరింది. ప్రభుత్వం జరిపే విచారణ అనంతరం బాధ్యులపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయి.

4వేల కిలోల బెల్లంతో మినీ వ్యాన్ సీజ్

ప్రత్తిపాడు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నల్లబెల్లం లోడుతో వెళుతున్న వ్యాన్‌ను సీజ్ చేశారు. ఎక్సైజ్ ప్రత్తిపాడు సీఐ పి.శివప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రత్తిపాడు సమీపంలోని యర్రవరం జాతీయ రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనకాపల్లి నుంచి మినీ వ్యాన్‌లో 4వేల కిలోల నల్లబెల్లం రవాణా చేస్తుండడాన్ని గుర్తించారు. ఈ వ్యాన్ అనకాపల్లి నుంచి యర్రవరం వచ్చి అక్కడ నుంచి ఏలేశ్వరం మండల గ్రామాల వైపు వెళుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నల్లబెల్లాన్ని, వ్యాన్‌ను సీజ్ చేసి లింగంపర్తికి చెందిన మనం నాగరాజును అరెస్ట్ చేశారు. బెల్లాన్ని పురమాయించిన గెద్దనపల్లికి చెందిన చిలపరశెట్టి వెంకటరమణపై కేసు నమోదు చేశారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

అమలాపురం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఇమ్మిడివరప్పాడు గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను, కొత్తగా బదిలీపై వచ్చిన ఉద్యోగులను గ్రామ సర్పంచ్ రేలంగి దుర్గారావు ఆధ్వర్యంలో గురువారం తాండవపల్లిలో ఘనంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

యానాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): యానాం మహిళ శిశు అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో యానాం సంక్షేమ శాఖాధికారి సురంపూడి రాజేంద్ర ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులకు కెరీర్, మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మునిస్వామి, కమిషనర్ అఖిల్ హాజరయ్యారు.

'జిల్లాలో విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నాం'


సమగ్రశిక్ష కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ప్యాప్టో జిల్లా నాయకులు

అమలాపురం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో విద్యాశాఖ నిర్వహిస్తున్న విద్యాశక్తి కార్యక్రమం స్వచ్ఛందమని, విధివిధానాలు ప్రకటించి నిర్బంధం చేయడాన్ని ప్యాప్టో జిల్లాశాఖ నిరసించింది. కొందరు ఉపాధ్యాయులపై అధికారులు, ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి తీసుకురావడాన్ని తప్పుబట్టారు. జిల్లాశాఖ పక్షాన విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.సురేష్‌కు జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రాలు గురువారం అందజేశారు.విద్యాశక్తి కార్యక్రమం అదనంగా 6నుంచి 9వ తరగతి వరకు నిర్వహించడాన్ని ప్యాప్టో జిల్లాశాఖ పక్షాన బహిష్కరిస్తున్నట్టు ప్రకటిస్తూ వినతిపత్రాలు అందజేశారు. ప్యాప్టోజిల్లా చైర్మన్ ఎంటీవీఏఎస్ సుబ్బారావు, ప్రధానకార్యదర్శి పోతంశెట్టి దొరబాబు, ప్యాప్టో నాయకులు పెంకే వెంకటేశ్వరరావు, నరిదే సత్యపల్లంరాజు, ఎంఎస్‌మునేశ్వరరావు, జీవీరమణ,మురుగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక


సోలార్‌పై బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, విద్యుత్‌శాఖాధికారులు

మలికిపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల విద్యుత్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు పీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ అన్నారు. గురువారం మలికిపురం సబ్‌స్టేషన్ వద్ద జరిగిన విద్యుత్ సమస్యల అవగాహన, ఫిర్యాదుల స్వీకరణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడానికి ఇటువంటి సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో పాల్గొన్న రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ రాజోలులో 132/11 ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో మిగులు విద్యుత్ స్టెప్ డౌన్ సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడం వల్ల గృహ అవసరాలకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యుత్‌ను అందించలేకపోతున్నామన్నారు. నియోజకవర్గంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో 110 విద్యుత్ స్తంభాలు కావాలని సమావేశం దృష్టికి తెచ్చారు. సమావేశానికి అధిక సంఖ్యలో విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు. మంచి స్పందన వచ్చింది. పలు ప్రాంతాల్లో లోవోల్టేజ్ సమస్యలు ఉన్నాయని, వ్యవసాయ విద్యుత్ మీటర్లు ఇవ్వాలని, ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని కోరారు. సమావేశానికి 800పైబడి దరఖాస్తులు రాగా 560 సమస్యలు పరిష్కారం చేసినట్టు విద్యుత్ అధికారులు తెలిపారు. పరిష్కార వేదికలో 39ఫిర్యాదులు అందాయన్నారు. సీజీఆర్ఎఫ్ ద్వారా రాష్ట్రంలో వినియోగదారులకు రూ.14.65లక్షలు నష్టపరిహారం అందించినట్టు సమావేశంలో తెలిపారు. ఈసదస్సులో విద్యుత్‌శాఖ సీజీఎం ఎస్.రాజబాబు, విద్యుత్‌శాఖ అధికారులు ఎం.మురళీకృష్ణ, ఎస్.సుబ్బారావు, కె.రాంబాబు, వై.విజయానంద్, కృష్ణంరాజు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీల ధర్నా


ముమ్మిడివరంలో ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలంతా తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ నాయకురాళ్లు సీఐటీయూ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని ధర్నా చేపట్టారు. వినతిపత్రాన్ని తహశీల్దార్ పి.సుభాష్‌కు అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, నిమ్మకాయల వెంకటేష్, వ్యవసాయ కార్మికసంఘు కమిటీ నాయకులు పాము బాలయ్య పాల్గొని సంఘీభావం తెలిపారు.అనంతలక్ష్మి, జి.మంగాయమ్మ, ఎస్.కనకదుర్గ,రమాదేవి పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు గురువారం నిరసన చేపట్టారు. మామిడికుదురు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మానవహారంగా ఏర్పడి డిమాండ్లు పరిష్కరించాలంటూ నినదించారు. ఎన్.అన్నపూర్ణ, కేవీ లక్ష్మి, జి.సూర్యకాంతం, డీబీ సరోజిని పాల్గొన్నారు.

అమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2014 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకపోవడాన్ని నిరసిస్తూ అమలాపురం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు పి.అమూల్య, కాశిన దుర్గ, పార్వతి, మణిమాల, విజయ, ఉమ తదితరులు నాయకత్వం వహించారు. అనంతరం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): తహశీల్దారు కార్యాలయం వద్ద డిమాండ్లను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలతో నినాదాలు చేశారు. తహశీల్దారుకు వినతిపత్రాన్ని అందజేశారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందికి వేతనాలు పెంచాలని, ఫేష్ యాప్ తొలగించాలని నిరసన వ్యక్తంచేస్తూ తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావుకు అంగన్‌వాడీ సిబ్బంది గురువారం వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేశారు.

పెరుగుతోన్న గోదావరి వరద

- లంక గ్రామాలు మునక
- వరద ముంపులో వరి పంట
- ఇళ్లల్లోకి వరద నీరు, ప్రజల ఇక్కట్లు




ఐ.పోలవరం: అన్నంపల్లి పాత అక్విడెక్టు వద్ద గోదావరి పరవళ్లు, ఉప్పలగుప్తం: వాడపర్రులో చెరువుల్లా మారిన పొలాలు, యానాం జీఎంసీ బాలయోగి వారధి వద్ద వరద ప్రవాహం

ముమ్మిడివరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువ ప్రాంతంలో వరద ఉధృతంగా ప్రవహించడంతో దిగువన ఉన్న ముమ్మిడివరం మండలంలోని లంక గ్రామాలకు వరద నీరు పోటెత్తుతుంది. మండలంలోని లంక గ్రామాల్లో లోతట్టు భూముల్లోకి వరదనీరు ప్రవేశిస్తుంది. గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, లంకాఫ్ గేదెల్లంక, చింతపల్లిలంక తదితర లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు ప్రవేశిస్తుంది. వివేకానంద వారధి నుంచి గురజాపులంక వెళ్లే సీసీ రోడ్డు గురజాపులంక వద్ద కొంతమేర వరదనీరు చేరింది. దీంతో రెవెన్యూ అధికారులు రోడ్డుకు ఇరు పక్కలా ఎరుపు జెండాలను పాతారు. గురువారం మధ్యాహ్నం నుంచి ఆ సిమెంటు రోడ్డుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుంది. కూనాలంకలోని అంతర్గత పుంతరోడ్లు వరదనీటిలో మునిగాయి. లంక గ్రామాల్లో సాగుచేసిన బెండా, బీర, వంగ, మునగ, ఆనబ వంటి కూరపాదుల్లోకి వరదనీరు చేరింది. లంకాఫ్ ఠాణేలంక వద్ద కొబ్బరితోటల్లోకి కూడా వరద నీరు ప్రవేశించింది. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, మండల ప్రత్యేకాధికారి బి.గౌతమ్, తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య, మండలస్థాయి అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. పంచాయతీ సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు స్థానికంగాఉండి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూము కొనసాగుతుంది. నాటుపడవలపై రాకపోకలు సాగించరాదని హెచ్చరికలు చేశారు. లంకాఫ్‌ఠాణేలంక, గురజాపులంకల వద్ద రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు మెకనైజ్డ్ బోట్లు ఏర్పాటుచేశారు. అవసరం బట్టి లోతట్టు ప్రాంతాల ప్రజలు మెరక ప్రాంతాలకు తరలివెళ్లాలని తహశీల్దార్ ఆదేశించారు.

రేవు ప్రయాణాలు నిలుపుదల

ఐ.పోలవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరద పోటెత్తడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. గోదావరి నదీ తీరం వెంబడి ఉన్న కొబ్బరి తోటల్లోకి వరదనీరు చేరడంతో రైతులు ముందు జాగ్రత్తగా వ్యవసాయ ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కేశనకుర్రు పంచాయతీ పల్లిగూడెం, పొగాకులంక, జాంబవానిపేట, గూగుల్‌లంక గ్రామాల ప్రజలు వరద ఉధృతితో ఆందోళన చెందుతున్నారు. వరద పెరుగుతుందన్న అధికారుల హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ సీహెచ్ విజయశ్రీ గురువారం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో గుత్తెనదీవి, గోగుల్లంక రేవుల వద్ద ప్రయాణాలను నిలిపివేశారు. జి.మూలపొలం-పల్లంకుర్రు రేవు దాటింపు నిలిపి వేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికార యంత్రాంగంతో పాటు స్థానిక ఉద్యోగులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

పల్లిపాలెంలో పోటెత్తిన వరద

అల్లవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వైనతేయ గోదావరికి వరద నీరు పోటెత్తింది. బోడసకుర్రు పల్లిపాలెంలో 30గృహాలను వరద నీరు చుట్టుముట్టింది. తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు వదర ప్రాంతంలో పర్యటించారు. ఉదయం పోటు సమయంలో 30 ఇళ్లను వరదనీరు చుట్టుముట్టిందని, తరువాత తగ్గిందని తహశీల్దార్ చెప్పారు. బెండమూర్లంక, ఓడలరేవు గ్రామాల్లో వరద ప్రభావం వల్ల పడవలపై రాకపోకలు బంద్ చేయించామన్నారు. మత్స్యకారులెవరూ సముద్ర జలాలు, గోదావరి వరద నీటిలో చేపల వేటకు వెళ్లవద్దని తహశీల్దార్ వీవీఎల్ నరసింహారావు అన్నారు. బోడసకుర్రు పల్లిపాలెంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రత్యేక శానిటేషన్ చేయించారు.

లంక గ్రామాల ప్రజల ఆందోళన

మామిడికుదురు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎగువన కురిసిన భారీ వర్షాలకు వరద తీవ్రత పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ప్రధాన లంక గ్రామాలైన అప్పనపల్లి, పెదపట్నం లంక, దొడ్డవరం, పాశర్లపూడి తదితర గ్రామాల ప్రజలు తమ వంటచెరకు, పశుగ్రాసం తదితర వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే పనిలో నిమగ్నమయ్యారు. అప్పనపల్లి కాజ్‌వే సమీపంలో వరదనీరు చేరడంతో లంక గ్రామాలైన అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తే ఆస్కారం ఉంది. గురువారం సాయంత్రానికి కాజ్‌వే పైకి వరద నీరు చేరుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అప్పనపల్లి స్నానాలరేవు వద్ద వరద పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తుంది. శుక్రవారానికి వరద తీవ్ర ఇంకా పెరిగే ఆస్కారం ఉండడంతో లంక గ్రామాల ప్రజలు భయాందోళనలు వక్తం చేస్తున్నారు.

పరవళ్లు తొక్కుతోన్న గోదావరి

అయినవిల్లి, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు గోదావరి నది పరవళ్లు తొక్కుతోంది. గౌతమీ, వృద్ధగౌతమీ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లంక గ్రామాలకు వరద పోటెత్తింది. అయినవిల్లి లంక తొగరపాయ వద్ద కాజ్‌వేపై వరద నీరు ప్రవహిస్తుంది. అయినవిల్లి, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక గ్రామాలకు ప్రయాణించే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముక్తేశ్వరంలో స్నాన ఘట్టాలు వరద నీటిలో మునిగాయి.

యానాంలో వరద ప్రవాహం

యానాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): యానాంలో వరద ప్రవాహం పెరుగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలకు యానాం జీఎంసీ బాలయోగి వారధివద్ద వరద ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పలు పర్యాటక కట్టడాలు, పర్యాటక కేంద్రాలు వరద ముంపునకు గురయ్యాయి. వరద పరిస్థితిపై అధికారులతో పరిపాలనాధికారి మునిస్వామి సమీక్ష నిర్వహించి ముంపు ప్రాంతాలను పరిశీలించారు.

వరద ప్రాంతాల పరిశీలన

పి.గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాలు గంటిపెదపూడి, ఉడిమూడి, నాగుల్లంక, మానేపల్లి, వాడ్రేవుపల్లి తదితర లంక గ్రామాలను నియోజకవర్గ ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ పీడీ టి.జయచంద్రగాంధీ, తహశీల్దార్ పి.శ్రీపల్లవి, ఇన్‌చార్జి ఎంపీడీవో జి.ఉమామహేశ్వరావు పరిశీలించారు. తుపాన్ షెల్టర్లు, పాఠశాలల్లో విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం తదితర అంశాలను పరిశీలించి స్థానిక సిబ్బందికి తగు సూచనలు చేశారు.

మునిగిన 650ఎకరాల నాట్లు

ఉప్పలగుప్తం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఉప్పలగుప్తం మండలంలో సుమారు 650ఎకరాల్లో సార్వా నాట్లు ఇప్పటికీ నీటిలో మునిగి ఉన్నట్టు తేలింది. ఇప్పటి వరకు మండలంలో 4,360ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేశారు. వీటిలో వర్షాలకు నాలుగు రోజుల ముందు వేసిన నాట్లు 90శాతం కుళ్లిపోయినట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈపొలాల్లో తిరిగి నాట్లు వెయ్యాలంటే ముంపునీరు పూర్తిగా బయటకు పోవాలి. అవసరమైన వరినారు అందుబాటులో ఉండాలి. అయితే ఇప్పటికే డ్రెయిన్లన్నీ తన్నిపట్టి పొలాల్లోకి నీరు ప్రవహిస్తోంది. ముంపునీటి నుంచి రోజుల వ్యవధిలో చేలు బయటపడకపోతే ఎక్కువ శాతం విస్తీర్ణంలో నాట్లు చనిపోయే ప్రమాదముందని అధికారులు చెబుతున్నారు. డ్రెయిన్లకు దూరంగా ఉన్న పొలాల రైతులు ఇప్పుడు ఇంజన్ల సహాయంతో నీటిని బయటకు పంపేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిలో నిండా మునిగిన 650ఎకరాల్లోని నాట్లు పూర్తిగా ధ్వంసమైనట్టేనని రైతులు అంటున్నారు. ఓల్డ్ అయినాపురం, రంగరాజుకోడు, గొరగనమూడి, ఓల్డ్‌సమనస, న్యూసమనస, ఉత్తర, దక్షిణ వీకాలేరు, పాయకరావుకోడు డ్రెయిన్లు గట్లను ఎగదన్ని ప్రవహిస్తున్నాయి. కూనవరం మేజర్ డ్రెయిన్‌లోకి అధిక పరిమాణంలో ముంపునీరు చేరడంతో డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. వెంటనే ముంపునీటిని బయటకు పంపించి, తమ సూచనల మేరకు యాజమాన్య పద్ధతులు పాటిస్తే వరినాట్లను రక్షించుకోవచ్చని వ్యవసాయాధికారి గుత్తుల కుమార్‌బాబు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో వైనతేయ నదీతీర ప్రాంతఅధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు బి.చినబాబు సూచించారు. తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. నందంపూడి, తొండవరం, నందంపూడి, మాచవరం, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లో వరద ఉధృతి నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద విషయాలను తెలియజేయాలన్నారు. ఎంపీడీవో ఏవీఎల్ నరసింహం, ఆర్ఐ ఏడుకొండలు పాల్గొన్నారు.




అయినవిల్లి: ముక్తేశ్వరంలో వరద నీటిలో తొగరపాయ, మామిడికుదురు: అప్పనపల్లి కాజ్‌వే వద్ద నీట మునిగిన ఇటుక బట్టీలు, ముమ్మిడివరం: లంకాఫ్ గేదెల్లంకలో వరద నీటిలో కూరపాదులు

చైర్మన్‌గా పవన్ బాధ్యతల స్వీకరణ

అమలాపురం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అమలాపురం మంత్రిప్రగడవారి సత్రం చైర్మన్‌గా గొర్తి పవన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జనసేన రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ కార్యదర్శి మహాదశ నాగేశ్వరరావు, మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను, నల్లా చిట్టిబాబు, పిండి రాజా, కల్వకొలను సతీష్, కొత్తూరి వంశీ తదితరులు అభినందించారు.

యానాం ఎస్పీగా వరదరాజన్

యానాం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): యానాం ఎస్పీగా పుదుచ్చేరికి చెందిన కె.వరదరాజన్‌ని నియమిస్తూ పుదుచ్చేరి పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అంబాజీపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట, గంగలకుర్రు విద్యుత్‌సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల నేపథ్యంలో పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8నుంచి 2గంటల వరకు సరఫరానిలిపివేస్తున్నట్లు ఈఈ కె.రాంబాబు తెలిపారు. అంబాజీపేట, మాచవరం, వాకలగరువు, నందంపూడి, తొండవరం, పోతాయిలంక, సాకుర్రు, గున్నేపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, కె.పెదపూడి, మొసలపల్లి, పాలగుమ్మి, నడిపూడి, బండారులంక గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ భీమనపల్లి ఫీడర్ లైన్స్ ట్రీ ట్రిమ్మింగ్, ఇతర నిర్వహణ పనులకు ఈనెల22న ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. గొల్లవిల్లి, సూదాపాలెం, భట్నుపాలెం, నంగవరం, భీమనపల్లి, సింగరాయపాలెం, విలసవిల్లి గ్రామాలకు సరఫరా ఉండదన్నారు. కాగా టి.చల్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ టి.చల్లపల్లి ఫీడర్ లైన్స్ నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 8నుంచి 2గంటల వరకు గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నిప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రులో కొత్తగా నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ 33కేవీ లైన్ పనుల కారణంగా శుక్రవారం సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపుం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో కలిపితే చర్యలు

అమలాపురం టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బయో మెడికల్ వ్యర్థాలను మున్సిపల్ వ్యర్థాలతో కలిపి పురపాలక సంఘ పారిశుధ్య కార్మికులకు అందజేస్తే ఆయా ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్‌లు, ల్యాబ్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని అమలాపురం మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్ కుమార్ హెచ్చరించారు. ఆయా యాజమాన్యాలతో గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బయో మెడికల్ వ్యర్థాలను ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెన్సీలకు మాత్రమే అందజేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. అన్ని ఆసుపత్రులు, ల్యాబ్‌లు ట్రేడ్ లైసెన్సులు కలిగి ఉండాలన్నారు.

రేపు ఉచిత దంత వైద్య శిబిరం

ఐ.పోలవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మురమళ్ల క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో బైర్రాజు ఫౌండేషన్ వద్ద ఈనెల23న ఉచిత దంతవైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎడాప్ట్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా, విష్ణు డెంటల్ కాలేజ్ సౌజన్యంతో నిర్వహించే శిబిరాన్ని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ప్రారంభిస్తారని క్షత్రియ సేవాసమితి తెలిపింది.

పీఏసీఎస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

అమలాపురం రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బండారులంక పీఏసీఎస్ నూతన కార్యవర్గ చైర్మన్‌గా కండిబోయిన సూర్యనారాయణమూర్తి(సూర్య) గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు సభ్యులు కాశిన వీరభద్రరావు, వరసాల నీలాంబరం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మిలు నూతన కార్యవర్గాన్ని అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు చింతా శంకరమూర్తి, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, పిచ్చిక శ్యామ్ పాల్గొన్నారు.

'పశ్చిమ' జేసీ పర్యటన


కనకాయలంక అంగన్వాడీ కేంద్రంలో భోజనం తింటున్న చిన్నారులతో పశ్చిమగోదావరి జిల్లా జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పి.గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు పశ్చిమగోదావరి జిల్లా నాలుగు మండలాలు వరదతాకిడికి గురవుతాయని పశ్చిమగోదావరి జిల్లాజాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వేను పరిశీలించిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. యలమంచిలి, పెనుగొండ, ఆచంట, నరసాపురం మండలాల్లో ఎనిమిది లంకగ్రామాలకు వరద తాకిడి ఉందన్నారు. రెవెన్యూతో పాటు అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేశామని చెప్పారు. కనకాయలంకలో ఆరు బోట్లను ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజులు లంకప్రాంతాల్లో విద్యార్థులకు సెలవులు ప్రకటించాలని, వరదలు అనంతరం ప్రత్యేక తరగతుల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని చేసే డీఈవోకు సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన ఆయన అంగన్వాడికేంద్రంలో చిన్నారుల తింటున్న భోజనాన్ని పరిశీలించారు. జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులు ఉన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

ముమ్మిడివరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పట్ల పూర్తిఅవగాహన ఏర్పరుచుకుని వ్యాధి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా క్లినికల్ సర్వీసెస్‌ఆఫీసర్ బుజ్జిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరం జడ్పీ బాలికల పాఠశాలలో ఎయిడ్స్‌నియంత్రణ, నివారణా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అవగాహనసదస్సులో ఆయనమాట్లాడారు.

కూనవరం డ్రెయిన్‌లోకి గోదావరి వరద నీరు

ఉప్పలగుప్తం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కూనవరం మేజర్ డ్రెయిన్‌లో కిట్టమ్మరేవు వద్ద రెండు రంగుల్లో నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది. మేజర్ డ్రెయిన్‌లో ఉప్పునీటి ప్రవాహానికి, గోదావరి వరదనీరు చేరడంతో విడివిడిగా రెండు రంగుల్లో నీరు ప్రవహిస్తోంది. వృద్ధగౌతమి నదిలోని వరదనీరు ఓల్డ్‌అయినాపురం డ్రెయిన్ ద్వారా ఎస్.యానాం కిట్టమ్మ రేవు వద్ద కూనవరం మేజర్ డ్రెయిన్‌లోకి వచ్చి చేరడంతో ఈపరిస్థితి ఏర్పడింది. గోదావరి వద్ద ఓల్డ్‌అయినాపురం డ్రెయిన్‌కు ఆటోమేటిక్ షట్టర్లు ఉంటాయి. గోదావరి పోటు సమయంలో డ్రెయిన్‌లోకి నీరురాకుండా ఈషట్టర్లు నియంత్రిస్తాయి. అయితే వరద సమయంలో మాత్రం షట్టర్లను తెరుస్తారు. దీనితో వరదనీరు డ్రెయిన్‌లోకి వస్తుంది. ఇప్పుడు అదే జరిగిందని రైతులు భావిస్తున్నారు.

పోలింగ్‌బూత్‌లకు ఓట్లు బదిలీ

పి.గన్నవరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పోలింగ్‌బూత్‌కి 1200మంది ఓటర్లు ఉండాలని, ఎక్కువ ఉంటే పక్క బూత్‌కు బదిలీ చేస్తున్నట్టు నియోజకవర్గ అసిస్టెంట్ ఓటరునమోదు అధికారి పి.శ్రీపల్లవి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు.

మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలి

మామిడికుదురు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక బీసీ సామాజిక భవనంలో మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గా రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన బీజేపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల25వ తేదీ సోమవారం రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో మాధవ్ మొదటిసారి చాయ్‌పే చర్చా కార్యక్రమం, శోభాయాత్రలో పాల్గొనడానికి వస్తున్నారని, పెద్దఎత్తున బీజేపీ శ్రేణులు పార్టీ జెండాలతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మంత్రికి గృహనిర్మాణ సమస్యలు వివరించిన ఎమ్మెల్యే

ముమ్మిడివరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు గృహ నిర్మాణ, సమాచారశాఖ మంత్రి కె.పార్థసారథిని సచివాలయంలో గురువారం కలిశారు. నియోజకవర్గానికి సంబంధించి గృహనిర్మాణ సమస్యలు, పక్కా ఇళ్ల మంజూరు తదితర విషయాలను మంత్రికి వివరించారు. గృహనిర్మాణంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని, నియోజకవర్గానికి అవసరమైన పక్కాఇళ్లు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

గురుకుల పాఠశాలలో సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

రాజోలు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శివకోటి గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 5, 6, 7 తరగతులకు జూనియర్ ఇంటర్ ఎంపీటీసీ, బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్లలో స్పాట్ అడ్మిషన్లు ఈనెల 25వ తేదీన ఉదయం 9నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ టి.లలితకుమారి తెలిపారు. ఈసందర్భంగా గురువారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ మిగిలిన సీట్లలో చేరే విద్యార్థినులు ఎంట్రన్స్ పరీక్ష రాయకపోయినా స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని ఆమె కోరారు. 5వ తరగతిలో 59 ఖాళీ సీట్లకు ఓసీ 1, ఎస్టీ 2, బీసీ-సీ 10, ఎస్సీ 46, 6వ తరగతిలో 20 ఖాళీ సీట్లకు ఎస్టీ 5, ఎస్సీ 15, 7వ తరగతిలో ఖాళీ సీట్లకు ఎస్సీ 4, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 6 ఖాళీ సీట్లకు ఎస్టీ 2, ఎస్సీ 2, బీసీ-సీ 1, ఓసీ 1, జూనియర్ బైపీసీలో రెండు ఖాళీ సీట్లకు ఎస్టీ 1, ఓసీ 1 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 9701856723, 6303190325 నంబర్లలో సంప్రదించాలనికోరారు.

ముమ్మిడివరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా భాగ్యశ్రీ

ముమ్మిడివరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా కాట్రేనికోన మండలానికి చెందిన జనసేన పార్టీ నాయకురాలు ఓగూరి భాగ్యశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కూటమి నాయకులతో కలిసి ఏఎంసీ కార్యాలయానికి ఆమె తరలివచ్చి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే వైస్‌చైర్మన్‌గా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లికి చెందిన బీజేపీ నాయకుడు గొలకోటి వెంకటరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. త్వరలోనే మార్కెటింగ్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం జరగనుంది. బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ భాగ్యశ్రీ, వైస్‌చైర్మన్ వెంకటరెడ్డిలను పలువురు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ స్ఫూర్తి కరపత్రాల పంపిణీ

అల్లవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): సంచారజాతుల విముక్తి కోసం బీజేపీ ఆధ్వర్యంలో సంచారజాతుల స్ఫూర్తి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు బీజేపీ మండల అధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో బెండమూర్లంక, బోడసకుర్రు గ్రామాల్లో సంచారజాతుల వారికి బీజేపీ స్ఫూర్తి కరపత్రాలను పంపిణీచేసి వారికి బీజేపీ జిల్లా ఇన్‌చార్జి పసుపులేటి మహాలక్ష్మిరావు పలు సూచనలు చేశారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

ఇసుక రీచ్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

ఆలమూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలమూరు, జొన్నాడలలో గోదావరి నుంచి ఇసుక తవ్వకాలు చేయడానికి ప్రజాభిప్రాయ సేకరణను గురువారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ అధ్వర్యంలో నిర్వహించారు. ఆలమూరు, జొన్నాడలలో ఏర్పాటు చేసిన సభల్లో ప్రజల నుంచి అభిప్రాయం సేకరణ చేపట్టారు. ప్రజలకు అందుబాటులో ఇసుక ఉంచేలా ర్యాంపులు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ వంశీధర్‌రెడ్డి, పర్యావరణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎంవీ శంకరరావు, పలువురు అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెర్లపాలెంలో...

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో ఇసుక రీచ్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆర్డీవో శ్రీకర్, పొల్యూషన్ కంట్రోల్ ఈఈ ఎంబీఎస్ శంకరరావు, మైనింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొని గ్రామస్థుల నుంచి సందేహాలను అడిగారు. ఆర్డీవో మాట్లాడుతూ మెర్లపాలెం ఇసుక రీచ్ నిర్వహణకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్టు తెలిపారు. ఈ రీచ్‌లో 48 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టామన్నారు. అనంతరం సర్పంచ్ మెర్ల రాము, పలువురు గ్రామస్థులు తమ సూచనలు తెలియజేశారు. సమావేశంలో తహశీల్దారు రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు విజయదుర్గా పీఠంలో శ్రావణ శుక్రవారం పూజలు

రాయవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. గురువారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు తెలిపారు. అనంతరం భక్తులతో సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు, లక్ష్మి అష్టోత్తర పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేయనున్నారు. విజయదుర్గా సేవా సమితి ఆధ్వర్యంలో అన్న సమారాధన జరుగుతుందన్నారు. ఈ పూజల్లో భక్తులంతా పాల్గొనాలని అడ్మినిస్ట్రేటర్ కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన ర్యాలీ

కె.గంగవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు గురువారం నిరసన ర్యాలీ చేశారు. కె.గంగవరం ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వారు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వీరలక్ష్మి, శ్రీదేవి, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం

రాయవరం, (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాయవరం తహశీల్దారు కార్యాలయం ఎదుట గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా జరిపారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్.కృష్ణకుమారి, డి.ఆదిలక్ష్మి పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం తహశీల్దారు ఐపీ శెట్టికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.కమలరత్నం, సీహెచ్ సత్యవేణి, ఎస్.నూకరత్నం, కె.కమల తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం తహశీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ బ్లాక్ డే పాటించి నిరసన తెలిపారు. ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు నినాదాలు చేశారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దారు రాజేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో టి.వెంకటలక్ష్మి, కె.వరలక్ష్మి, పి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్ సెంటర్‌లో మానవహారం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో గురువారం అంగన్‌వాడీ వర్కర్లు నల్ల చీరలతో ధర్నా జరిపారు. ముందుగా వారంతా నల్లచీరలు ధరించి రాజగోపాల్ సెంటర్ వరకు ప్రదర్శన జరిపిన అనంతరం మానవహారం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు మేడిశెట్టి దుర్గమ్మ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సత్తిబాబు, అంగన్‌వాడీ నాయకులు విజయలక్ష్మి, కె.జవహర్, దుర్గ, సూర్యకుమారి, చంద్రకళ, లక్ష్మీరత్న, పద్మ, అంగన్‌వాడీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, తహశీల్దార్‌లకు వినతిపత్రం

మండపేట,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ తీరుకు నిరసనగా గురువారం మండపేటలో అంగన్‌వాడీలు మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, తహసీల్దార్ తేజేశ్వరరావులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. అనంతరం స్థానిక కలువపువ్వు సెంటరులో వారు మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ జి.శ్రీనివాస్‌కు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ద్వారపూడి హైస్కూల్లో ఆడిటోరియం ప్రారంభం



ద్వారపూడి జిల్లా పరిషత్ హైస్కూల్లో దాతలు నిర్మించిన ఆడిటోరియాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ద్వారపూడిలో వున్న చేకూరి కాశీ విశ్వనాధరాజు జిల్లా పరిషత్ హైస్కూల్లో గ్రామానికి చెందిన వెలుగుల ప్రభాకరరావు దంపతులు నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ముందుకు వస్తున్న దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు యరగతపు బాబ్జి, విద్యా కమిటీ చైర్మన్ జయ రవీంద్ర, రమేష్ రాజు, బుల్లబ్బు, మాజీ సర్పంచ్ ఎం.వీరభద్రరావు, ఎన్.వీర్రెడ్డి, సత్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర, గోపాలస్వామి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు

ద్రాక్షారామ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలోనున్న సోమేశ్వర, వేణుగోపాలస్వామి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం గురువారం జరిగింది. అనంతరం జరిగిన సమావేశంలో ధర్మకర్తల మండలి చైర్మన్‌గా అన్యం జానకిరామయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమం లో వెల్ల ఆలయ ఈవో వైవీవీ సత్య నారాయణ, ఈవో శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆకుల నారాయణరావు, ఉపాధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, గెడ్డం బాబూరావు, సత్యంశెట్టి ప్రసాద్, పిండి సూర్యారావు, మాధవరపు బుల్లబ్బు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల ట్రస్టు బోర్డుల ప్రమాణ స్వీకారం

ఆలమూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పెనికేరులోని రెండు ఆలయాలకు పాలకవర్గాల నియామకం చేయడంతో గురువారం ట్రస్టు బోర్డులు ప్రమాణ స్వీకారం చేశారు. రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా కోన విగ్నేష్‌తోపాటు పలువురు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. బాలాత్రిపుర సుందరి సమేత ఇష్టకాంతేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కాంద్రేగుల శ్రీనివాస్‌తోపాటు పలువురు డైరెక్టర్లు బాధ్యతలు స్వీకరించారు. దీనికి ముఖ్య అతిథిగా కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొని నూతన పాలకవర్గాలను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంఎస్ఆర్ కృష్ణ, కూటమి నాయకులు ఈదల చినబాబు, సంగిత సుభాష్, సలాది జయప్రకాష్‌నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోపాలస్వామి ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారం

కె.గంగవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలోని గోపాలస్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యులు గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పాలక మండలి అధ్యక్షుడిగా పెద్దింశెట్టి నరసింహమూర్తి, సభ్యులుగా తుట్టపు వెంకట నారాయణ, జాస్తి సూర్యనారాయణమూర్తి, ఇనుకొండ వెంకట రాజు, బాదంపూడి నాగేశ్వరరావు, కొల్లి శ్రీదుర్గ, అనసూరి శ్రీలక్ష్మి, భీమరాజు వెంకట సూర్య మాణిక్యాంబ, గుత్తుల సత్యనారాయణమ్మ, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పెద్దింటి రామాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిర్రా రాజ్‌కుమార్, గెడ్డం నాగేశ్వరరావు, గంగాబత్తుల కాశీ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

రాయవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మేలైన యాజమాన్య పద్ధతులపై గురువారం చెల్లూరులో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రంలో ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కేవీఎన్ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కోసమే పొలంబడి

కె.గంగవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మేలైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కలిగించేందుకే పొలంబడి నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ఏ. సద్గురుమూర్తి అన్నారు. గురువారం కుందూరులో రైతులకు పలు సూచనలు చేశారు.

గోదావరికి పెరిగిన వరద ఉధృతి



ఆలమూరు మండలం జొన్నాడ పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి వరద ఉధృతి

ఆలమూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి పెరుగుతుండటంతో మండలంలోని ఆయా లంక గ్రామాల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో ఇప్పటికే ఆయా లోతట్టు ప్రాంతాల్లోని వాణిజ్య పంటలు వరదనీటిలో మునిగిపోయాయి. గోదావరి వరద మరింత పెరిగే అవకాశాలు ఉందన్న సమాచారంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మండలంలోని బడుగువానిలంక, మడికి, చెముడులంక, చొప్పెల్ల, జొన్నాడ, మూలస్థానం, ఆలమూరు లంక భూముల్లోకి వరద నీరు చేరింది. జొన్నాడ పుష్కర్‌ఘాట్ వరదనీటిలో మునిగిపోయింది. రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి వరద ఉధృతంగా ప్రవహిస్తున్నది.

కోటిపల్లి వద్ద పోటెత్తుతున్న వరద

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోటిపల్లి వద్ద గోదావరి ఉరకలు వస్తోంది. రెండు రోజుల నుంచి పెరుగుదల కారణంగా స్థానిక పుష్కరాల రేవులో పై మెట్ల వరకూ వరదనీరు చేరుకుంది. కోటిపల్లి ఫెర్రీ రేవులో ర్యాంపుపై వరకు వరదనీరు చేరింది. మరో రెండు అడుగులు పెరిగితే స్థానిక మత్స్యకార కాలనీలోకి వరద నీరు చేరుకునే అవకాశం ఉంది.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: గోదావరి వరద ఉధృతిపై రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ బండి మృత్యుం జయరావు అన్నారు. గురువారం ఆయన కోటిపల్లి, సుందరపల్లి వద్ద గోదావరి వరద ఉధృతిని పరిశీలించారు. సుందరపల్లి వద్ద బలహీనంగా ఉన్న ఏటిగట్టు రక్షణ చర్యలు పరిశీలించారు. ఈయన వెంట ఆర్ఐ వెంకట్రావు, పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీబాషా తదితరులు ఉన్నారు.

వరద ముంపులో వాణిజ్య పంటలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు వచ్చి చేరడంతో వాణిజ్య పంటలు ముంపుబారిన పడుతున్నాయి. మండల పరిధిలోని గౌతమి, వశిష్టపాయలలో వరదనీరు పోటెత్తి ప్రవహిస్తున్నది. నదీ పరివాహక ప్రాంతంలోని లంక పొలాలు ముంపు బారిన పడుతున్నాయి. దీంతో వాణిజ్య పంటలు ముంపులో చిక్కుకుంటున్నాయి.

మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి సమీక్ష

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): వరద ఉధృతి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో విజయలక్ష్మి అన్నారు. గురువారం కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లోని వరద పరిస్థితులపై ఆమె ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో మోహన్, పంచాయతీ, రెవెన్యూ సిబ్బందితో కలిసి పర్యటించి సమీక్షించారు. ఆయా లంక గ్రామాల్లో తహసీల్దార్ జి.శ్రీనివాస్ పర్యటించారు. కార్యక్రమాల్లో కేదార్లంక, అద్దంకివారిలంక గ్రామాల సర్పంచ్‌లు వీధివెంకటరెడ్డి, నాతి గవరయ్య, ఆర్ఐ అర్జమ్మ, పంచాయతీ కార్యదర్శులు జి. మధుసూదన్, వి. భీమశంకర్, వీఆర్‌వోలు వెంకటేశ్వరరావు, కృష్ణ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి: గోదావరికి వరద పోటెత్తుతున్న నేపథ్యంలో అధికారులంతా సమన్వయంతో విధులను నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, సివిల్ సప్లైస్ డీఎం పి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఆర్డీవో అఖిల, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి పలు అంశాలపై సమీక్షించారు. వరదల పట్ల ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలపై వివిధ శాఖల అధికారులను వారు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, ఈవోపీఆర్డీ మోహన్, ఇరిగేషన్, వైద్య, ఆరోగ్యశాఖ, ఆర్‌డబ్ల్యుఎస్, హౌసింగ్, విద్యుత్, వ్యవసాయ తదితర శాఖల అధికారులు తెలిపారు.



కపిలేశ్వరపురంలో అధికారులతో సమీక్షిస్తున్న నియోజకవర్గ ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఆర్డీవో అఖిల

అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద పెరుగుతుండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. గురువారం బొబ్బర్లంక వద్ద అఖండ గోదావరి నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. బ్యారేజీ వద్ద 1వ ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో గోదావరి వరద ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. పిచ్చుకలంక, వాడపల్లిలంకల్లో ఉంటున్న కుటుంబాలను సురక్షితంగా ప్రాంతాలకు తరలించాలన్నారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బందితో ఆయన వరద పరిస్థితిపై సమీక్షించారు.

పశువులను బయటకు తరలించండి

జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): గోదావరి వరదల నేపథ్యంలో ఆయా లంక ప్రాంతాల్లో గురువారం జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ కె.వెంకట్రావు పర్యటించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ వరద తాకిడికి గురవకుండా పశువులను మైదాన ప్రాంతానికి తరలించాలని సూచించారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో పాడి రైతులు ఆందోళన చెందవద్దని దాణా పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి మోటూరి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

రావులపాలెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఊబలంక పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శ్రీకాంత్ వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాయవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాయవరం, పసలపూడి సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ రామచంద్రపురం డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చెట్లు కొమ్మల తొలగింపు, లైన్ల మరమ్మతుల కారణంగా పసలపూడి సబ్‌స్టేషన్ పరిధిలో కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అదే విధంగా రాయవరం సబ్‌స్టేషన్ పరిధిలో వెదురుపాక ఫీడర్, వి.సావరం, రాయవరం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

నేడు మండపేటలో..

మండపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం విద్యుత్‌శాఖ ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో నేటి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. మండపేట-ఏడిద రోడ్డులో వున్న పెద్దమ్మతల్లి ఆలయం రోడ్డులో వున్న సబ్‌స్టేషన్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో ఏడిద రోడ్డు, మండపేట బైపాస్ రోడ్డు, రాజీవ్‌గృహకల్ప, విజయలక్ష్మీనగర్, మెహర్‌బాబా ఆశ్రమం, సత్యశ్రీరోడ్డు, తర్వాణిపేట, బస్టాండ్, బ్యాంకు కాలనీ, వీరభద్రపురం, శ్రీలక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

మాధవ్ పర్యటనను విజయవంతం చేయండి

కె.గంగవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ 25న అమలాపురంలో పర్యటించనున్నారని దీన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి చంద్రరావు కోరారు. గురువారం అముజూరు గ్రామంలో ఆయన అధ్యక్షతన మండల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా అనకాపల్లి ఇన్‌ఛార్జ్ కర్రి చిట్టిబాబు, పార్టీ సీనియర్ నాయకుడు అవసరాల రమణమూర్తి హాజరై పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సలాది శేఖర్, కవులూరి వెంకటకృష్ణ, నున్న సత్యనారాయణ, దంగేటి మాచర్రావు, వాసంశెట్టి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా తయారీ కేంద్రాల తనిఖీ

రాయవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాయవరం శివారు ప్రాంతంలో ఉన్న భవాని, శ్రీగణపతి ఫైర్‌వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రాలను గురువారం ట్రైనీ డీఎస్పీ పి.ప్రదీప్తి తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలకు అనుమతులు ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించారు. దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో బాణసంచా తయారీదారులు భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశాన్ని ఆరా తీశారు. బాణసంచా తయారీదారులు నిబంధనలు పాటించాలని, రూల్స్ పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట ఎస్ఐ డి.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



వెంటూరు సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

సోమేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

రాయవరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వెంటూరు సోమేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి పూజలు నిర్వహించారు. పిండిప్రోలు సుబ్బారావు దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. మాసశివరాత్రిని పురస్కరించుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, సోమేశ్వరస్వామికి రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, నీరాజన మంత్రపుష్పాలు, మహా నివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ పూజల్లో అర్చకుడు మద్దిరాల సాయి కిరణ్‌రాజా, రుత్విక్కులు విందుమూరి సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి సూరిబాబు, కోరుమిల్లి కామేశ్వరరావు, మైలవరపు సూర్యనారాయణశర్మ, కమిటీ సభ్యులు దువ్వూరి రామారావు, తటవర్తి రాఘవరాజు, వాడ్రేవు వెంకట రామారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు సామూహిక వరలక్ష్మి వ్రతాలు

కొత్తపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఉచిత సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నామని ఆలయ సహాయ కమిషనరు దారపరెడ్డి సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 9 గంటలకు దేవస్థానం అర్చకులు, వేద పండితులతో వ్రతం నిర్వహించనున్నట్టు తెలిపారు. వ్రతం అనంతరం భక్తులకు అన్నప్రసాదం ఏర్పాటు చేశామని ఈవో తెలిపారు.

సతీష్‌రాజుకు ఎమ్మెల్యే పరామర్శ

కొత్తపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆలమూరులో జరిగిన రైతు సంబర కార్యక్రమంలో భాగంగా జరిగిన ఘటనలో గాయపడిన తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు సతీష్‌రాజును గురువారం కాకినాడలో చికిత్స పొందుతున్న ఆసుపత్రిలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరామర్శించారు. కాలికు చికిత్స చేయించుకోగా వైద్యులను ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఉన్నతంగా చదవాలి

మండపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం మెరుగైన విద్యను అందిస్తున్నదని రామచంద్రపురం డివిజనల్ విద్యాధికారి ప్రత్తి రామలక్ష్మణమూర్తి అన్నారు. వెలగతోడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం ఆయన సందర్శించారు. పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థుల స్థాయిని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేయటంతోపాటు మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, వీరవెంకట్రావు, సాయిబాబు, శ్రీహరి, సహదేవుడు, తారకం తదితరులు పాల్గొన్నారు.

బండారు సంజీవ్ జన్మదిన వేడుకలు



ఆత్రేయపురం రేవులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఆత్రేయపురం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు యువనేత సంజీవ్ జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తమ యువనాయకుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్రేయపురం రేవులో టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు అధ్యక్షతన కేక్‌కట్ చేశారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ ముళ్ళపూడి భాస్కరరావు, తోటకూర సుబ్బరాజు, ముదునూరి రామభద్రరాజు తదితరులతో పాటు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల్లో పార్టీ నాయకులు కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. వివిధ సేవా కార్యక్రమాలను ఆ పార్టీశ్రేణులు నిర్వహించారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువ నాయకుడు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు తనయుడు సంజీవ్ పుట్టినరోజు వేడుకలను గురువారం టీడీపీ శ్రేణులు నిర్వహించారు. తొలుత పార్టీ శ్రేణులు స్థానిక శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించి మొక్కల నాటే కార్యక్రమం చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ విళ్ళ మారుతీప్రసాద్, గనిశెట్టి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

దాత సహకారంతో మంచినీటి కుళాయిల ఏర్పాటు

రావులపాలెం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవేత్త మల్లిడి తిరపరెడ్డి ఆర్థిక సహకారంతో రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్వీ సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాత తిరపరెడ్డి, కళాశాల చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. అనంతరం తిరపరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు.

వరిదుబ్బులను పరిశీలించిన శాస్త్రవేత్తలు, అధికారులు

ఆలమూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మోదుకూరు, గుమ్మిలేరు గ్రామాల్లో వరిసాగులో దుబ్బులకు వింత తెగులు సోకి తీవ్ర నష్టం కలిగిస్తున్నదని రైతులు గగ్గోలు పెడుతుండటంతో ఆయా పంట భూములను ఏరువాక శాస్త్రవేత్త, వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు. ఏరువాక శాస్త్రవేత్త నందకిషోర్, ఆలమూరు వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్‌కెవీ చౌదరి, ఏవో మీనా, వీఏవో రవికుమార్ పంట భూములను పరిశీలించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చుండ్రు శ్రీనివాస్, దాయన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గృహోపకరణాల తయారీ శిక్షణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు శిక్షణలు ఇస్తున్నామని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం అన్నారు. గురువారం రామచంద్రపురంలో నాలుగు రోజులు నిర్వహించిన గృహోపకరణాల తయారీ శిక్షణ ముగింపులో ఆయన మాట్లాడారు. గృహ సంబంధ ఉత్పత్తుల తయారీ శిక్షణ తీసుకున్న 35 మంది మహిళలకు వాసంశెట్టి సత్యం, శిక్షణ నిపుణురాలు ప్రియా జైన్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను భక్తితో జరుపుకోవాలి

కపిలేశ్వరపురం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలను భక్తితో నిర్వహించుకోవాలని మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు అన్నారు. గురువారం అంగర పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వినాయక ఉత్సవ కమిటీలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అంగర ఎస్ఐ హరీష్‌కుమార్, కమిటీ నిర్వాహకులు, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

మేర్నీడి కుటుంబీకులకు పరామర్శ

ద్రాక్షారామ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం జడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు కుటుంబీకులను వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ తదితరులు గురువారం పరామర్శించారు. ఇటీవల మేర్నీడి వెంకటేశ్వరరావు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన కుటుంబీకులను పరామర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భవానీ, మండల కన్వీనర్ పోలినాటి ప్రసాద్, జిల్లా అధికారి ప్రతినిధి పెమ్మిరెడ్డి మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.